RNI NO: TEL/TEL/2009/28544

తెలంగాణ & ఆంధ్రప్రదేశ్

# పీపుల్స్ డైరీ

సమగ్ర వార్తా దినపత్రిక

విలువలతో కూడిన నిఖార్సయిన జర్నలిజం

సంపుటి : 18 సంచిక : 89

Vol : 18 Issue : 89

Editor : KONDAPARTHI KIRAN
CELL : 9493019044

కరీంనగర్, శనివారం 30 మే 2026
Karimnagar, Saturday 30 May 2026

పేజీలు : 08 వెల రూ : 4-00

Pages : 08 Price : 4-00



WANTED

పీపుల్స్ డైరీ దినపత్రిక తెలంగాణ & ఏపీలోని వివిధ జిల్లాల్లో పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

సెంటర్లు

◆ హనుమకొండ ◆ కరీంనగర్
◆ భూపాలపల్లి ◆ పెద్దపల్లి/రామగుండం
◆ జనగామ ◆ మహబూబాబాద్
◆ హైదరాబాద్ ◆ నిజామాబాద్

Cell : 9493019044
9618509859



## 'పీపుల్స్‌డైరీ' అసోసియేట్ ఎడిటర్‌గా

# గుంటి విద్యాసాగర్

- అభినందలు తెలిపిన జర్నలిస్టులు, శ్రేయోభిలాషులు
- మూడు దశాబ్దాల అనుభవం ఆయన సొంతం
- వివిధ పత్రికలు, ఛానళ్లకు సేవలు...

పీపుల్స్‌డైరీ- హైదరాబాద్ : 'పీపుల్స్‌డైరీ' అసోసియేట్ ఎడిటర్‌గా సీనియర్ జర్నలిస్ట్ గుంటి విద్యాసాగర్‌ను నియమిస్తూ పత్రికా యాజమాన్యం ప్రకటించింది. ఈమేరకు శనివారం నియామకపు ఉత్తర్వులు జారీచేసింది. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన విద్యాసాగర్ గత మూడు దశాబ్దాలుగా వివిధ పత్రికలు, టీవీ ఛానళ్లలో జర్నలిస్టుగా తన సేవలు అందించారు. విద్యాసాగర్ నియామకం పట్ల 'పీపుల్స్‌డైరీ' దినపత్రిక స్టాఫ్ రిపోర్టర్లు, విలేకరులు, సిబ్బంది ఆనందం వ్యక్తంచేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు సీనియర్ జర్నలిస్టులు, వివిధ యూనియన్ నాయకులు అభినందనలు తెలిపారు.




# మారిన రాజకీయ ముఖచిత్రం

- భారతదేశ పాలిటిక్స్‌లో ఊహించని మార్పులు
- ఐదు నెలలు, ఐదు రాష్ట్రాలు... ఐదుగురు కొత్త సీఎంలు...
- దక్షిణం నుంచి తూర్పు వరకు.. మారిన అధికార మార్పిడి

2వ పేజీలో..

# సూపర్ ఎల్‌నినో గుబులు

- వర్షాకాలంపై తీవ్ర ప్రతికూల ప్రభావం
- రైతాంగానికి నిరాశే మిగిలేనా...
- అధిక ఉష్ణోగ్రతలకు ఎల్‌నినోనే కారణం
- నైరుతి ముందే వచ్చినా ఆశించిన మేర పడవట!
- భారత వాతావరణ శాఖ అంచనా



పీపుల్స్‌డైరీ-న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా మాడుపగిలే ఎండలు, తీవ్రమైన ఉక్కబోత, వడగాల్పులతో జనం అల్లాడిపోతున్నారు. నైరుతి రుతుపవాలు ఎప్పుడు? వస్తాయా అని ఎదురుచూస్తోన్న జనాలకు ఈ ఎండల నుంచి ఇప్పుడప్పుడే ఉపశమనం లభించేలా కన్పించడం లేదు. రుతుపవనాల రాక మరింత ఆలస్యం కానుందని భారత వాతావరణ విభాగం తాజాగా పేర్కొంది. ఇవి జూన్ 4, 5 తేదీల్లో కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉన్నట్లు ఐఎండీ అంచనా వేస్తోంది. ముందుగా మే 26 నాటికి నైరుతి భారత్‌ను పలకరించే అవకాశం ఉందని అంచనా వేసింది. కానీ, ఈసారి మాత్రం సూపర్-ఎల్‌నినో, వాతావరణ మార్పుల ప్రభావం గట్టిగానే ఉండటంతో ఐఎండీ అంచనాలు (మిగతా 2లో...)

- కేంద్రం కొత్త వ్యవసాయ వ్యూహం
- పంటల మార్పిడిని ప్రోత్సహించడమే లక్ష్యం
- తెలంగాణలో కొన్నేండ్లుగా భారీగా పెరిగిన వరి ఉత్పత్తి
- గోదాముల్లో పెరుగుతున్న నిల్వలు
- వేధిస్తోన్న పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయల కొరత
- వరి పొలాల్లో కొత్త దారులు పరిచే యోచన
- రాష్ట్రంలో వరిసాగును తగ్గించడమే టార్గెట్

# వరితో వర్రీ!



2వ పేజీలో..



# రీజినల్ రింగ్‌రైలు సర్వే పూర్తి!

- 174.50 కిలోమీటర్ల మేర ఉత్తర భాగం
- 7657 ఎకరాలు భూసేకరించాలని అంచనా
- త్వరలోనే డీపీఆర్‌ను రెడీ చేస్తాం
- రాష్ట్ర ప్రభుత్వానికి ద.మ రైల్వే వెల్లడి!?

పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ :
ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న హైదరాబాద్ రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టుకు సంబంధించి కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి లైడార్ సర్వే పూర్తి అయింది. దీంతో 174.50 కిలోమీటర్ల మేర రీజినల్ రింగ్ రైలు ఉత్తర భాగం రానున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఇక ఈ ప్రాజెక్టుకు సంబంధించిన లైడార్ సర్వే పూర్తి కావడంతో.. త్వరలోనే డీపీఆర్‌ను రెడీ చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వానికి దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది. ఇక ఈ ఉత్తర భాగం కోసం 7657 ఎకరాల భూమిని సేకరించాలని (మిగతా 2లో...)

# రిజర్వ్ చేసిన మూడు నెలల్లోగా తీర్పులివ్వాల్సిందే

కింది కోర్టులకు సుప్రీం కోర్టు ఆదేశాలు

- గడువు దాటితే సదరు కేసును వేరే బెంచ్‌కు బదిలీ చేస్తాం
- బెయిల్ వచ్చిన రోజే ఖైదీలను విడుదల చేయాలి



పీపుల్స్‌డైరీ-న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా వివిధ హైకోర్టుల్లో వాదనలు ముగిసి, తీర్పులను రిజర్వ్ చేసిన తర్వాత కూడా నెలల తరబడి జాప్యం జరగడంపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇకపై ఏ హైకోర్టు అయినా సరే ఒక కేసులో తీర్పును రిజర్వ్ చేసిన తర్వాత గరిష్ఠంగా మూడు నెలల లోపే ఆ తీర్పును తప్పనిసరిగా వెలువరించాలని సుప్రీం కోర్టు స్పష్టమైన డెడ్‌లైన్ విధించింది. 2025లో జార్ఖండ్ హైకోర్టు ఇచ్చిన ఒక తీర్పును వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడంలో జరిగిన ఆలస్యంపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన అనంతరం సుప్రీం కోర్టు ఈ చారిత్రాత్మక మార్గదర్శకాలను జారీ చేసింది.

ఈ మేరకు భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ విపిన్ పంచోలిలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం న్యాయ వ్యవస్థలో పారదర్శకత, వేగం (మిగతా 2లో...)

# కల్తీ మద్యం తాగి 15 మంది బలి!

- మరికొందరికి తీవ్ర అస్వస్థత
- మహారాష్ట్రలో పెను విషాదం



2లో

# ఆరుగురు మృతి!

- కుప్పకూలిన నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి..
- ఉత్తరప్రదేశ్ స్టేట్‌లో విషాదం
- శిథిలాల కింద గాయాలతో మరికొందరు?

వివరాలు : 2వ పేజీలో...

# మారిన రాజకీయ ముఖచిత్రం

- భారతదేశ పాలిటిక్స్‌లో ఊహించని మార్పులు
- ఐదు నెలలు, ఐదు రాష్ట్రాలు... ఐదుగురు కొత్త సీఎంలు...
- దక్షిణం నుంచి తూర్పు వరకు.. మారిన అధికార మార్పిడి

పీపుల్స్‌డైరీ-పొలిటికల్ బ్యూరో : భారత రాజకీయ చరిత్రలో 2026 సంవత్సరం ఒక కీలక మలుపుగా నిలిచిపోయింది. కేవలం ఐదు నెలల వ్యవధిలోనే దేశంలోని ఐదు ప్రధాన రాష్ట్రాలు కొత్త ముఖ్యమంత్రులను చూసి రాజకీయ పటాన్ని పూర్తిగా మార్చేశాయి. ఎక్కడో సంకీర్ణ రాజకీయాలు, మరెక్కడో అధికార భాగస్వామ్య ఒప్పందాలు, ఇంకొన్ని చోట్ల ప్రజా తీర్పు.. ఇలా భిన్న కారణాలతో ఈ నాయకత్వ మార్పులు చోటుచేసుకున్నాయి. 2029 లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రధాన రాజకీయ పార్టీలు తమ వ్యూహాలకు పదునుపెడుతున్న వేళ.. ఈ మార్పులు దేశ రాజకీయాల్లో సరికొత్త చర్చకు దారితీశాయి.

దక్షిణాది రాజకీయాలకు కేంద్రబిందువైన కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ చివరకు 'రొటేషనల్ సీఎం' ఫార్ములాను అమలు చేసింది. 2023 ఎన్నికల తర్వాత సిద్ధరామయ్య, డీకే శివకుమార్ మధ్య జరిగిన అధికార భాగస్వామ్య ఒప్పందం ప్రకారం.. ఇప్పుడు డీకే శివకుమార్ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహిస్తున్నారు. పార్టీ అంతర్గత సమతుల్యతను కాపాడేందుకు కాంగ్రెస్ హైకమాండ్ తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లో పెద్ద చర్చకు దారితీసింది. కన్నడ కాంగ్రెస్‌లో శివకుమార్ వర్గం దీన్ని చారిత్రాత్మక విజయంగా భావిస్తుండగా.. సిద్ధరామయ్య అనుచరులు మిశ్రమ స్పందన వ్యక్తం చేస్తున్నారు.


ఇక తూర్పు భారతదేశ రాజకీయాలను కుదిపేసిన అతిపెద్ద పరిణామం పశ్చిమ బెంగాల్‌లో చోటుచేసుకుంది. దాదాపు 15 ఏళ్ల పాటు అధికారాన్ని ఏలిన మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్‌కు ప్రజలు షాక్ ఇచ్చారు. భారతీయ జనతా పార్టీ చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసి తొలిసారి అక్కడ అధికారాన్ని చేజిక్కించుకుంది. ఒకప్పుడు మమతకు అత్యంత సన్నిహితుడిగా ఉన్న సువేందు అధికారి ఇప్పుడు అదే బెంగాల్‌కు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చగా మారింది. అవినీతి ఆరోపణలు, నియామక కుంభకోణాలు, హిందూ ఓటు బ్యాంక్ సమీకరణ.. ఇవన్నీ బీజేపీ విజయానికి ప్రధాన కారణాలుగా విశ్లేషకులు చెబుతున్నారు.

తమిళనాడులో అయితే రాజకీయ చరిత్రనే తిరగరాసే ఫలితం వెలువడింది. దశాబ్దాలుగా డీఎంకే, అన్నాడీఎంకేల మధ్యే తిరిగిన అధికార పోరు ఈసారి పూర్తిగా మారిపోయింది. సినీ నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ తొలి ఎన్నికలకే సంచలనం సృష్టించింది. యువతను ఆకర్షించే ప్రచారం, అవినీతి వ్యతిరేక నినాదాలు, తమిళ గౌరవాన్ని ముందుకు తెచ్చిన విజయ్.. ప్రజల్లో భారీ ఆదరణ సంపాదించారు. వీసీకే, ఐయూఎంఎల్ వంటి మిత్రపక్షాలతో కలిసి ఆయన ప్రభుత్వం ఏర్పాటు చేయడం తమిళ రాజకీయాల్లో కొత్త అధ్యాయంగా మారింది. సినీ తెరపై 'దళపతి'గా పేరు తెచ్చుకున్న విజయ్ ఇప్పుడు రాజకీయాల్లోనూ అదే ప్రభంజనం సృష్టించారు.

కేరళలో కూడా ఈసారి రాజకీయ గాలి పూర్తిగా మారిపోయింది. వరుసగా అధికారంలో కొనసాగిన ఎల్‌డీఎఫ్ ప్రభుత్వానికి ప్రజలు బ్రేక్ వేశారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ ఘన విజయం సాధించి తిరిగి అధికారంలోకి వచ్చింది. అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా దూకుడుగా వ్యవహరించిన వీడీ సతీషన్‌ను కాంగ్రెస్ ఏకగ్రీవంగా ముఖ్యమంత్రిగా ఎంపిక చేసింది. ఎల్‌డీఎఫ్ ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లడమే కాకుండా.. పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేయడంలో సతీషన్ కీలక పాత్ర పోషించారు. అందుకే ఆయన ఇప్పుడు కేరళ రాజకీయాల్లో కాంగ్రెస్‌కు కొత్త ఆశాకిరణంగా కనిపిస్తున్నారు.

బీహార్‌లో అయితే దాదాపు రెండు దశాబ్దాల 'నీతీశ్ యుగం' ముగిసింది. మారుతున్న పొత్తులు, సంకీర్ణ రాజకీయాలతో ఎప్పుడూ కేంద్రంగా నిలిచిన నితీశ్ కుమార్ ప్రభావం ఈసారి తగ్గిపోయింది. బీజేపీ తొలిసారి పూర్తిస్థాయిలో నాయకత్వ బాధ్యతలు చేపట్టి సామ్రాట్ చౌదరిని ముఖ్యమంత్రిగా ప్రకటించింది. నాన్-యాదవ్ ఓబీసీలు, ఈబీసీలు, దళిత వర్గాలను ఏకీకృతం చేస్తూ ఆయన బలమైన రాజకీయ ఆధారాన్ని నిర్మించుకున్నారు. బీహార్‌లో బీజేపీ దీర్ఘకాలిక నాయకత్వ వ్యూహానికి ఇది నాందిగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

మొత్తానికి 2026లో చోటుచేసుకున్న ఈ ఐదు నాయకత్వ మార్పులు కేవలం రాష్ట్ర రాజకీయాలకే పరిమితం కావడం లేదు. ఇవి 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందుమాటగా మారుతున్నాయి. కొత్త ముఖాలు, కొత్త వ్యూహాలు, కొత్త కూటములతో దేశ రాజకీయాలు మరింత ఆసక్తికర దశలోకి అడుగుపెడుతున్నాయి.



# సూపర్ ఎల్‌నినో గుబులు...

(మొదటి పేజీ తరువాయి)

తారుమారయ్యాయి. మే 16 నాటికే అండమాన్ సముద్రంలోకి ప్రవేశించినా.. అక్కడ నుంచి నెమ్మదిగా కదులుతుండటంతో రాక మరింత ఆలస్యమవుతోంది. కేరళను తాకిన మూడు నాలుగు రోజుల తెలుగు రాష్ట్రాల్లోకి రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉంది. గతేడాది, అంచనాలకు మించి 8 రోజుల ముందుగానే మే 24న కేరళ తీరాన్ని తాకాయి. ఆ తర్వాత రెండు రోజుల్లోనే తెలుగు రాష్ట్రాల్లోకి ప్రవేశించాయి. ఇక, ఈ ఏడాది రుతుపవన కాలంలో (జూన్ నుంచి సెప్టెంబరు మధ్య) వర్షపాతం సాధారణం కన్నా తక్కువ నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని ఐఎండీ ఇప్పటికే ప్రకటించింది. ఐఎండి ప్రకారం.. వాయువ్య, ఈశాన్య భారతదేశంలోని కొన్ని ప్రాంతాలు, దక్షిణ ద్వీపకల్పంలోని తూర్పు భాగాలు, దానికి ఆనుకొని ఉన్న ప్రాంతాలు, తూర్పు తీరంలో అక్కడక్కడా ఉన్న ప్రాంతాలు మినహా, దేశంలోని మిగతా ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. జూన్ 2026 నాటికి దేశవ్యాప్తంగా దీర్ఘకాల సగటు (ఎల్‌పీఏ)లో 92 శాతం కంటే తక్కువ వర్షపాతం ఉంటుందని ఐఎండి అంచనా వేసింది. ఇక, జూన్‌లోనూ ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఉత్తర్ ప్రదేశ్, హర్యానా, పంజాబ్, బిహార్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. జూన్‌లోనూ వడగాల్పులు వీయడం వల్ల ప్రజారోగ్యం, నీటి లభ్యత, విద్యుత్ వినియోగం, నిత్యావసర సేవలపై గణనీయమైన ప్రభావం చూపొచ్చు. అలాగే, వృద్ధులు, పిల్లలు, కార్మికులు, అనారోగ్య సమస్యలు ఉన్నవారు ఎక్కువ కాలం పాటు తీవ్రమైన వేడికి గురికావడం వల్ల ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. నిరంతరంగా అధిక ఉష్ణోగ్రతల వల్ల మౌలిక సదుపాయాలు, వనరుల నిర్వహణ వ్యవస్థలపై కూడా అదనపు ఒత్తిడి పడుతుందని, ఊహించిన పరిస్థితుల దృష్ట్యా, రాష్ట్ర ప్రభుత్వాలు, జిల్లా యంత్రాంగాలు అవసరమైన చర్యలు చేపట్టాలని ఐఎండీ సూచించింది.

# వరితో వర్రీ...!

- కేంద్రం కొత్త వ్యవసాయ వ్యూహం
- పంటల మార్పిడిని ప్రోత్సహించడమే లక్ష్యం
- తెలంగాణలో కొన్నేండ్లుగా భారీగా పెరిగిన వరి ఉత్పత్తి
- గోదాముల్లో పెరుగుతున్న నిల్వలు
- వేధిస్తోన్న పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయల కొరత
- వరి పొలాల్లో కొత్త దారులు పరిచే యోచన
- రాష్ట్రంలో వరిసాగును తగ్గించడమే టార్గెట్

**పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ :** గత కొన్నేళ్లుగా తెలంగాణలో విపరీతంగా వరిధాన్యం పండుతోంది. రైతులు పంట విస్తీర్ణాన్ని పెంచడమే కాకుండా.. మెరుగైన విత్తనాలు, పురుగు మందులు, సరైన సాగు పద్ధతులతో వరి ఉత్పత్తిలోనూ భారీగా దిగుబడులు సాధిస్తున్నారు. ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఏటా వరి ఉత్పత్తి భారీగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలోనే దేశంలోనే వరి ధాన్యాన్ని ఉత్పత్తి చేసే రాష్ట్రాల జాబితాలో తెలంగాణ కూడా చేరిపోయింది. అయితే దేశవ్యాప్తంగా బియ్యం, వడ్ల నిల్వలు భారీగా పేరుకుపోతున్నాయి.

గోదాముల్లో భారీగా నిల్వ ఉండటంతో.. ఇటీవలె కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రబీ పంట కొనుగోళ్లు ప్రారంభం కాకముందే.. 3 నెలలకు సరిపడా రేషన్ బియ్యాన్ని దేశవ్యాప్తంగా ఒకేసారి ఏప్రిల్ నెలలో జారీ చేసింది. దీంతో గోదాముల్లో కాస్త ఖాళీ ఏర్పడింది. అయితే పరిస్థితి ఇలాగే కొనసాగితే ప్రతీసారి ఇలాగే చేయలేమని భావిస్తున్న కేంద్ర ప్రభుత్వం.. దేశవ్యాప్తంగా వరి పంట సాగును తగ్గించాలనే టార్గెట్ పెట్టుకుంది.

ఈ క్రమంలోనే తెలంగాణలో రికార్డు స్థాయిలో పెరుగుతున్న వరి సాగుపై కేంద్ర కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించి.. పంటల మార్పిడిని ప్రోత్సహించడమే లక్ష్యంగా సరికొత్త ప్రణాళికను రెడీ చేసింది. దేశవ్యాప్తంగా రాబోయే 5 ఏళ్లలో ఏకంగా 2.5 కోట్ల ఎకరాల (250 లక్షల ఎకరాలు) మేర వరి సాగును తగ్గించాలని ఒక భారీ లక్ష్యాన్ని పెట్టుకుంది. ఇందులో తెలంగాణ వాటా 10 శాతం. అంటే తెలంగాణలో రానున్న ఐదేళ్లలో ఏకంగా 25 లక్షల ఎకరాల్లో వరి సాగును తగ్గించాల్సి ఉంటుంది.

ఇందుకోసం ప్రతీ సంవత్సరం 5 లక్షల ఎకరాల్లో వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించాలని.. రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. తెలంగాణలో వరి సాగు రికార్డులు సృష్టిస్తుండగా.. గడిచిన 3 ఏళ్లలోనే సాగు విస్తీర్ణం ఏకంగా 16 లక్షల ఎకరాలు పెరిగి.. మొత్తంగా 133 లక్షల ఎకరాలకు చేరింది. దీంతో ఏటా సుమారు 3 కోట్ల మెట్రిక్ టన్నుల వరిధాన్యం ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే ఉత్పత్తి అవుతోంది. వ్యవసాయంలో యాంత్రీకరణ పెరగడం.. ప్రతీ గ్రామంలోనూ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కావడంతో వరి పంటను పండించేందుకు రైతులు ఆసక్తి చూపిస్తున్నారు.

ఇక.. రాష్ట్రంలో, దేశంలో వరి ధాన్యం విపరీతంగా పండటంతో.. డిమాండ్ తగ్గగా.. మరోవైపు పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయల కొరత తీవ్రంగా వేధిస్తోంది. దీంతో మన అవసరాలకు తగ్గట్టుగా.. తెలంగాణలో ఇవన్నీ ఉత్పత్తి కాకపోవడంతో వాటి కోసం ఇతర రాష్ట్రాలపై ఆధారపడాల్సి వస్తోంది. అందుకే తెలంగాణలో వరి పంటను తగ్గించి.. ఆ స్థానంలో పప్పుధాన్యాలు, ఇతర వాణిజ్య పంటలు, పామాయిల్ వైపు రైతులను మళ్లించాలని కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది.

# కల్తీ మద్యం తాగి 15 మంది బలి!

పీపుల్స్‌డైరీ-పూణె : మహారాష్ట్రలోని పుణె, పింప్రి-చించ్వాడ్ పారిశ్రామిక పరిసర ప్రాంతాల్లో కల్తీ మద్యం పెను కలకలం సృష్టించింది. నకిలీ మద్యం తాగి 15 మంది ప్రాణాలు కోల్పోగా.. మరికొందరు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రులలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. పింప్రి-చించ్వాడ్ పరిధిలోని దాపోడి, ఫుగేవాడి ప్రాంతాల్లో 8 మరణాలు సంభవించాయి. దీంతో పాటు పుణె నగర పరిధిలోని కాలే పడల్ ప్రాంతంలో ముగ్గురు, హడప్సర్ ప్రాంతంలో ఇద్దరు చొప్పున ప్రాణాలు కోల్పోవడంతో మొత్తం మృతుల సంఖ్య 15కు చేరిందని అధికారిక వర్గాలు ధ్రువీకరించాయి.

ఈ ఘోరానికి కారణమైన నకిలీ, కల్తీ మద్యాన్ని యోగేష్ వాంఖడే అనే స్థానిక అక్రమ మద్య వ్యాపారి తయారు చేసినట్లు పోలీసులు ప్రాథమిక విచారణలో గుర్తించారు. అతనికి గతంలోనే ఈ ప్రాంతంలో అక్రమంగా నాటు సారా, నకిలీ మద్యం సరఫరా చేసే ముఠాలతో సంబంధాలు ఉన్నాయని, ఇతనిపై ఇప్పటికే వివిధ పోలీస్ స్టేషన్లలో పలు కేసులు కూడా నమోదై ఉన్నాయని దర్యాప్తు అధికారులు వెల్లడించారు. ఈ క్రమంలో పోలీసులు ప్రధాన నిందితుడు యోగేష్‌తో పాటు ఈ అక్రమ రవాణాలో కీలక పాత్ర పోషించిన అనుచరులను అదుపులోకి తీసుకున్నారు. మృతులు సేవించిన మద్యం నమూనాలను ల్యాబ్‌కు పంపించామని, అందులో ఏయే ప్రాణాంతక కెమికల్స్ కలిపారనేది వైద్య పరీక్షల నివేదిక తర్వాతే స్పష్టమవుతుందని అధికారులు పేర్కొన్నారు.

# రిజర్వ్ చేసిన మూడు నెలల్లోగా తీర్పులివ్వాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

కోసం ఆర్టికల్ 142 అధికారాలను ఉపయోగిస్తూ పలు కీలక ఆదేశాలు ఇచ్చింది.

**బెయిల్ దరఖాస్తులపై ప్రత్యేక నిబంధనలు..**

ముఖ్యంగా నిందితుల, పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన కేసుల్లో మూడు నెలల కంటే ముందే అత్యంత వేగంగా తీర్పులు ఇవ్వాలని ధర్మాసనం ఆకాంక్షించింది. బెయిల్ దరఖాస్తులపై వీలైనంత వరకు వాదనలు విన్న రోజే తీర్పులు ప్రకటించడం ఆదర్శనీయమని పేర్కొంది. ఒకవేళ ఏవైనా కారణాల వల్ల బెయిల్ ఆర్డర్‌ను రిజర్వ్ చేయాల్సి వస్తే.. మరుసటి రోజే దానిని ఖచ్చితంగా వెలువరించాలని స్పష్టం చేసింది. దీనితో పాటు బెయిల్ మంజూరైన రోజునే ఆ ఆర్డర్ కాపీలను జైలు అధికారులకు వెంటనే పంపాలని, విచారణ ఖైదీలకు బెయిల్ లభించిన అదే రోజున లేదా మరుసటి రోజున జైలు నుంచి విడుదల చేయాలని కోర్టు ఆదేశించింది. ట్రయల్ కోర్టులు ఈ నిబంధనలను పాటించిన వెంటనే ఆ సమాచారాన్ని సంబంధిత హైకోర్టులకు నివేదించాల్సి ఉంటుంది.


**మూడు నెలలు దాటితే బెంచ్ మార్పు..**

హైకోర్టుల్లో వాదనలు పూర్తయి తీర్పు తేదీని రిజర్వ్ చేసినప్పుడు, ఆ వివరాలను హైకోర్టు అధికారిక వెబ్‌సైట్‌లో స్పష్టంగా ప్రదర్శించాలి. తీర్పు చెప్పే రోజున కేవలం అమలు చేయాల్సిన ముఖ్య భాగాన్ని మాత్రమే ఓపెన్ కోర్టులో చదివి వినిపించాలి. ఆ తర్వాత కారణాలతో కూడిన పూర్తి తీర్పు కాపీని ఏడు రోజుల్లోగా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

ఒకవేళ తీర్పు రిజర్వ్ చేసిన మూడు నెలల లోపు సదరు న్యాయమూర్తులు తీర్పును వెల్లడించకపోతే.. రిజిస్ట్రార్ జనరల్ ఆ విషయాన్ని సంబంధిత హైకోర్టు చీఫ్ జస్టిస్ దృష్టికి తీసుకెళ్లాలి. అప్పుడు చీఫ్ జస్టిస్ తీర్పు కోసం మరో రెండు వారాల అదనపు సమయాన్ని ఇవ్వవచ్చు. ఆ గడువులోగా కూడా తీర్పు రాకపోతే.. ఆ కేసును పూర్తిగా వేరే బెంచ్‌కు కేటాయించాల్సి ఉంటుంది. ఈ కొత్త మార్గదర్శకాలకు అనుగుణంగా ఆయా హైకోర్టుల వెబ్‌సైట్‌లలో చీఫ్ జస్టిస్‌ల పర్యవేక్షణలో అవసరమైన సాఫ్ట్‌వేర్ మార్పులు చేయాలని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది.

# ఆరుగురు మృతి!

- కుప్పకూలిన నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి..
- ఉత్తరప్రదేశ్ స్టేట్‌లో విషాదం
- శిథిలాల కింద గాయాలతో మరికొందరు?



పీపుల్స్‌డైరీ-హమీర్‌పూర్ (యూపీ) : ఉత్తరప్రదేశ్‌లోని హమీర్‌పూర్ జిల్లాలో అప్పుడే నిర్మాణంలో ఉన్న బెత్వా నది వంతెన కూలి పెను విషాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఆరుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోగా, మరికొందరు శిథిలాల కింద చిక్కుకుపోయినట్లు తెలుస్తోంది. ఈ దుర్ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. హమీర్‌పూర్‌లోని కురారా పోలీస్ స్టేషన్ పరిధిలో మోర్కందర్ పర్సాని నుంచి నైతి గ్రామం వరకు ఈ వంతెన నిర్మాణం జరుగుతోంది. గురువారం (మే 28) రాత్రి కార్మికులు యథావిధిగా పనుల్లో నిమగ్నమయ్యారు. అయితే, శుక్రవారం తెల్లవారుజామున సుమారు 3 గంటలకు తీవ్రమైన తుఫానుతో పాటు బలంగా వీచిన ఈదురు గాలుల ధాటికి వంతెన కుప్పకూలింది.

కాగా ఈదురు గాలుల ధాటికి భారీ షట్టరింగ్, స్లాబ్‌లు, పిల్లర్లు ఒక్కసారిగా కుప్పకూలాయి. ఈ ప్రమాద సమయంలో వంతెన కింద పనిచేస్తున్న కార్మికులపై భారీ కాంక్రీట్ శిథిలాలు పడటంతో వారు బయటకు రాలేక, అక్కడికక్కడే చిక్కుకుపోయారు. స్థానికుల సమాచారంతో పోలీసులు, జిల్లా యంత్రాంగం, విపత్తు నిర్వహణ బృందాలు వెంటనే రంగంలోకి దిగాయి. చీకటి, ప్రతికూల వాతావరణం వల్ల సహాయక చర్యలు ప్రారంభంలో తీవ్ర ఆటంకం ఏర్పడింది. అయినప్పటికీ, అధికారులు రాత్రంతా శ్రమించి జేసీబీలు, గ్యాస్ కట్టర్ల సహాయంతో శిథిలాలను తొలగించే ప్రయత్నం చేశారు. ఇప్పటివరకు ఆరుగురు కార్మికుల మృతదేహాలను వెలికితీశారు. ప్రమాదంలో గాయపడిన మరికొందరిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. శిథిలాల కింద ఇంకా కొందరు చిక్కుకుని ఉండే అవకాశం ఉండటంతో, రెస్క్యూ ఆపరేషన్ ముమ్మరంగా కొనసాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది.




# రీజినల్ రింగ్ రైలు సర్వే పూర్తి..?

(మొదటి పేజీ తరువాయి)

రైల్వే అధికారులు సర్కార్‌కు సమాచారం ఇచ్చారు. ఇక ఈ ప్రాజెక్టు భూసేకరణకు రూ.6900 కోట్ల వ్యయం కానుండగా.. ఆ మొత్తం ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే భరించనుంది.

ఈ హైదరాబాద్ రీజినల్ రింగ్ రైలు ఉత్తర భాగం డీపీఆర్ (డీటైయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టు)ను తయారు చేసేందుకు ఈ నెలాఖరు వరకు మాత్రమే గడువు ఉంది. ఇక రెండో దశలో నిర్మించే రీజినల్ రింగ్ రైల్ దక్షిణ భాగం సర్వేకు మరింత టైమ్ పట్టనుంది. దక్షిణ భాగం ఎలైన్‌మెంట్‌ను కూడా ఖరారు చేసిన రేవంత్ రెడ్డి సర్కార్.. దాని ఆమోదం కోసం ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి పంపించింది. కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన తర్వాతే సర్వే మొదలు కానుందని రైల్వే అధికారులు వెల్లడించారు. దక్షిణ భాగం రింగ్ రైలు డీపీఆర్‌కు 2026 జూన్ తుది గడువుగా మొదట నిర్ణయించగా.. అసలు సర్వే ప్రారంభం కాకపోవడంతో దాని డీపీఆర్ మరింత ఆలస్యం కానున్నట్లు తెలుస్తోంది.

ఇక ఈ హైదరాబాద్ రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టు సర్వేకు 2023 జూన్ 21వ తేదీన కేంద్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. ఆ తర్వాత రంగంలోకి దిగిన దక్షిణ మధ్య రైల్వే అధికారులు సర్వే చేసి ఎలైన్‌మెంట్‌ను ఖరారు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన రీజినల్ రింగ్ రోడ్డుకు కొన్ని ప్రాంతాల్లో పక్క నుంచి.. మరికొన్ని ప్రాంతాల్లో కొంత దూరం నుంచి రింగ్ రైలు ఎలైన్‌మెంట్ ఉండటంతో.. ఈ 2 ప్రాజెక్టులకు, 2 సార్లు భూసేకరణ చేయడం కష్టమవుతుందని భావించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఇదే విషయాన్ని కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లింది. ఈ క్రమంలోనే రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో కలిసి ఇదే విషయాన్ని ప్రస్తావించారు. రీజినల్ రింగ్ రోడ్డుకు ఆనుకుని.. రీజినల్ రింగ్ రైలు ఎలైన్‌మెంట్‌ను మార్చాలని కోరడంతో.. పాత ఎలైన్‌మెంట్‌లో మార్పులు చేశారు.

# పొడిచెట్టి విష్ణువర్ధన్‌కు సన్మానం

**పీపుల్స్‌డైరీ-హనుమకొండ :** ఇటీవల జరిగిన హనుమకొండ జిల్లా టీ యూ డబ్ల్యూ జే ఎన్నికల్లో కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నికైన డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్ ను వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ బాధ్యులు ఆత్మీయంగా సన్మానించారు. హనుమకొండ ములుగు రోడ్డు ప్రాంతంలో సంస్థ బాధ్యులు గట్టు మహేష్ బాబు నివాసంలో జరిగిన సంస్థ ముఖ్య బాధ్యుల సమావేశంలో విష్ణువర్ధన్ కు పూలమాల వేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సంస్థ బాధ్యులు మాట్లాడుతూ విష్ణువర్ధన్ సుమారు 20 సంవత్సరాలుగా జర్నలిస్ట్ గా జర్నలిజం వృత్తిలో కొనసాగుతూనే అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ అందరి మన్ననలను పొందుతున్న వ్యక్తి అని కొనియాడారు. ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, జర్నలిజంలో తనకంటూ ప్రత్యేకత చాటుకున్న విష్ణువర్ధన్ కు సంస్థ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక చైర్మన్ ముహమ్మద్ సిరాజుద్దీన్,అధ్యక్షులు,కేయూ పాలక మండలి సభ్యులు ఆచార్య బి సురేష్ లాల్, ప్రధాన కార్యదర్శి శ్రీపాద సుధాకర్ రావు,బాధ్యులు ఆచార్య కొక్కొండ విజయబాబు,ఘంటా రామ రెడ్డి,కేయూ పాలక మండలి సభ్యులు డాక్టర్ అనితా రెడ్డి,మండల పరుశరాములు,పగడాల సరళ, బిటవరం శ్రీమన్నారాయణ,మైస ఎర్రన్న, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా టిపిటిఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు


**పీపుల్స్‌డైరీ-తొర్రూరు:** తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవం ఎంపీపీఎస్ దంతాలపల్లి లో ఘనంగా నిర్వహించారు టిపిటిఎఫ్ మండల అధ్యక్షుడు తాలురీ రవీందర్ టిపిటిఎఫ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం టిపిటిఎఫ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాలూరి రవీందర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వము ఉద్యోగ ,ఉపాధ్యాయుల కోసం ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన నూతన వైద్య విధానములో అనేక లోపాలు ఉన్నాయన్నారు. తక్షణమే ఈ లోసుగులన్నింటిని సవరించి ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయడం కోసం తక్షణమే ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరిపి లోపాలులేని ఉద్యోగులందరికీ ఆమోదయోగ్యమైన ఈ హెచ్ ఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. టిపిటి ఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి చింతల సురేష్ మాట్లాడుతూ స్వాతంత్రానికి పూర్వము నుంచి తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ పట్ల, ఉపాధ్యాయ సమస్యల సాధన కోసం అలుపెరగని పోరాటం చేస్తూ ఉపాధ్యాయ ఉద్యమాలకే దిక్సూచిగా పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టిపిటిఎఫ్ కార్యకర్తలు డి నగేష్, ఉమేష్ ,వెంకన్న, రామ్మూర్తి, ఎమ్మార్సీ సిబ్బంది ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.




# కీసరలో విషాదం..

**ధోబీఘాట్ వద్ద నవజాత శిశువు మృతదేహం కలకలం**

మేడ్చల్ మే 29 (పీపుల్స్ డైరీ) : కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో హృదయ విదారక ఘటన వెలుగులోకి వచ్చింది. నాగారం విజయపురి కాలనీ రోడ్ నెం.4లోని ధోబీఘాట్ ప్రాంతంలో నవజాత మగ శిశువు మృతదేహం లభ్యమవడంతో స్థానికంగా తీవ్ర కలకలం రేగింది. పోలీసుల వివరాల ప్రకారం 28 మే 2026 మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో పెట్రోల్ మొబైల్ 2 ఇన్‌చార్జ్‌గా విధులు నిర్వహిస్తున్న పి.సి జంగయ్యకు డయల్-100 ద్వారా సమాచారం అందింది. స్థానికుడు తిరుమల శెట్టి సోమరాజు ఫోన్ చేసి, ధోబీఘాట్ ప్రాంతంలో తెలుపు రంగు కవర్‌లో 1 నుంచి 2 రోజుల వయస్సు గల నవజాత శిశువును గుర్తుతెలియని వ్యక్తులు వదిలివెళ్లారని, అక్కడి నుంచి దుర్వాసన వస్తోందని తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా, నవజాత మగ శిశువు మృతదేహం కనిపించింది. అనంతరం అంబులెన్స్ సిబ్బంది శిశువును పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కీసర పోలీస్ స్టేషన్‌లో 497/2026 కింద సెక్షన్ 93 బి.ఎన్.ఎస్ ప్రకారం కేసు నమోదు చేశారు. కేసును ఎస్.ఐ. బి. నాగరాజు నమోదు చేయగా, దర్యాప్తును ఎస్.ఐ. కె. శ్రీనివాస్ చేపట్టారు. నవజాత శిశువును అక్కడ వదిలివెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులను గుర్తించేందుకు పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తూ విచారణ కొనసాగిస్తున్నారు.



# బుట్టాయిగూడెం కోసం ఎటువంటి సేవా అయినా చేయడానికైనా సిద్ధం

- బుట్టాయిగూడెం ఎస్టి కాలనీలో టెంకాయ కొట్టి స్లాబ్ పనులను ప్రారంభించిన సర్పంచ్ జాడి రాంబాబు



**ఏటూరు నాగారం మే 29 (పీపుల్స్ డైరీ) :**కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెం గ్రామంలో గత అరునెలల క్రింద సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన మాట ప్రకారం మంత్రివర్యులు సీతక్క చొరవతో బుట్టాయిగూడెం ఎస్టీ కాలనీలో ఉన్నటువంటి శ్రీ లక్ష్మి దేవర గుడి నూతన గుడి కోసం మంత్రి సీతక్క చొరవతో రూ.5 లక్షలతో నూతన గుడిని కట్టడం జరుగుతుంది. అందులో భాగంగా శుక్రవారం గుడి స్లాబ్ వేయడం ప్రారంభించారు. కావునా బుట్టాయిగూడెం సర్పంచ్ జాడి రాంబాబు టెంకాయ కొట్టి స్లాబ్ పనులను ప్రారంభించారు. అలాగే గ్రామ నాయకులు వార్డు సభ్యులు గుడి పూజారులు మరియు గ్రామ యువకులు పాల్గొని టెంకాయ కొట్టి స్లాబ్ పనులను ప్రారంభించారు. సర్పంచ్ జాడి రాంబాబు మాట్లాడుతూ నేను బుట్టాయిగూడెం కోసం ఎటువంటి సేవా అయినా చేయడానికైనా సిద్ధంగా ఉన్నా నా ఊరు అభివృద్ధి చేయడమే నా లక్ష్యం బుట్టాయిగూడెం ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉన్నా పార్టీలకు అతీతంగా నా దగ్గరకు తీసుకురండి నా వంతు కృషి సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నా రోడ్లు కానీ డ్రైనేజ్ కానీ, విద్యార్థుల చదువుల స్కూల్ విషం కానీ, గుడులు మరియు హాస్పిటల్ సమస్యలు ఊరిలో త్రాగునీరు సమస్యలు బుట్టాయిగూడెం అభివృద్ధి చేయడానికి నా వంతు కృషి చేయడానికి సిద్ధంగా ఉన్నా అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు తాటి రాజబాబు, వార్డు మెంబెర్ సునార్కని ఆనందరావు,బీసీ జేఏసీ అధ్యక్షులు ముదురుకొల్లా బిక్షపతి, మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కుమ్మరి వెంకట్, యూత్ నాయకులు జాడి నరేష్, జాడి రాజు భీమని నరేష్, గుంటి రాజు, మారగోని కిష్టయ్య,గ్రామ నాయకులు అసరెల్లి సమ్మయ్య, జనగాం నారాయణ, సునార్కని విజయ్, రాజు ముత్తేస్, నాగరాజు రఘుబాబు, మహిళ నాయకురాలు సునార్కని చిలుక, మరియు గ్రామ పెద్దలు లక్ష్మి దేవర గుడి పూజారులు, ఆలయం కమిటీ సిబ్బంది మరియు గుడి మేస్త్రిలు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో ఎస్పీ పర్యటన

## రైస్ మిల్లులను సందర్శించిన జిల్లా ఎస్పీ



**భూపాలపల్లి మే 29 పీపుల్స్ డైరీ :**శుక్రవారం భూపాలపల్లి జిల్లా గోర్లవీడు గ్రామంలోని వెంకటేశ్వర ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లును జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు, సీఐ నరేష్ కుమార్‌లతో కలిసి పరిశీలించారు. మిల్లులో వడ్ల నిల్వ, ప్రాసెసింగ్ విధానం, రోజుకు ఎంత మేర వడ్లు స్వీకరిస్తున్నారనే అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రైతుల నుండి సాధ్యమైనంత ఎక్కువ వడ్లను పారదర్శకంగా కొనుగోలు చేయాలని సూచించడం జరిగింది. అలాగే రానున్న రోజుల్లో వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున వడ్ల లోడింగ్, అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని రైస్ మిల్ యాజమాన్యానికి సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని వడ్ల కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లులను స్థానిక పోలీస్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రోజువారీ వడ్ల కొనుగోలు, ఎగుమతులపై నివేదికలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించాలని ఆదేశించారు.

# హుజురాబాద్‌లో ఎస్ఐఆర్‌పై అవగాహన కార్యక్రమం

- గ్రామ గ్రామాన అవగాహన కల్పిస్తాం : కూన శ్రీశైలం గౌడ్



**హుజురాబాద్ టౌన్ మే 29 (పీపుల్స్ డైరీ) :**హుజురాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎస్ఐఆర్ (ూ×=) పై నియోజకవర్గ స్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఎస్ఐఆర్ కోఆర్డినేటర్ కూన శ్రీశైలం గౌడ్, హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులకు ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పించారు. అనంతరం కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎస్ఐఆర్‌పై గ్రామ గ్రామాన ప్రజలకు అవగాహన కల్పిస్తూ ముందుకు వెళ్లాలని అన్నారు. దీనికోసం పోలింగ్ బూత్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండి పకడ్బందీగా పని చేయాలని సూచించారు. హుజురాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ బలమైన శక్తిగా ఉందని, ఆ బలాన్ని మరింత పెంచాలని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో ముఖ్యమని, ప్రజల ఓటు హక్కును కాపాడటం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యత అని అన్నారు. హుజురాబాద్ నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ బూత్‌లలో ఎస్ఐఆర్‌పై విస్తృత ప్రచారం నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని, వైస్ చైర్‌పర్సన్ అంజలి, కౌన్సిలర్లు, జిల్లా ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, దేవస్థాన చైర్మన్లు, డైరెక్టర్లు, మండలాధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్, బీసీ, ఎస్సీ, మైనారిటీ, సేవాదళ్ నాయకులు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# మాకు తెలియకుండానే అభివృద్ధి పనులకు తీర్మానాలా..?

- భగ్గుమన్న కౌన్సిలర్లు..!
- తీవ్ర అసంతృప్తిలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్..?
- హుజురాబాద్ మున్సిపాలిటీలో ఏం జరుగుతోంది..?



**హుజురాబాద్ టౌన్ మే 29 (పీపుల్స్ డైరీ) :** హుజురాబాద్ మున్సిపాలిటీలో మెజారిటీ కౌన్సిలర్లు భగ్గుమన్నారు. ఒకవైపు సుమారు రూ.4.50 కోట్ల అభివృద్ధి పనులకు తీర్మానాలు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ బి. కిషన్ అధికారికంగా ప్రకటించగా, మరోవైపు వాటి గురించి తమకేమీ తెలియదని 19 మంది కౌన్సిలర్లు ప్రకటన విడుదల చేయడం సంచలనంగా మారింది. దీంతో మున్సిపాలిటీలో అసలు ఏం జరుగుతోందన్న చర్చ స్థానిక ప్రజల్లో, రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. మున్సిపల్ ఎన్నికలు ఫిబ్రవరిలో జరిగాయి. అప్పటి నుంచి సమావేశాలు సాదాసీదాగానే కొనసాగుతున్నాయి. గతంలో బడ్జెట్‌ను కూడా ఆమోదించారు. అయితే తాజాగా అభివృద్ధి పనుల అంశంపై బుధవారం జరిగిన సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. మున్సిపాలిటీ కార్యాలయం మొదటి అంతస్తులో రూ.1.50 కోట్ల వ్యయంతో సమావేశ మందిర నిర్మాణానికి కూడా తీర్మానం చేసినట్లు సమాచారం. ప్రస్తుత పరిస్థితుల్లో ఇది అవసరమా అనే చర్చ కూడా జరుగుతోంది. సాధారణంగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి ముందస్తుగా కౌన్సిలర్లందరికీ సమాచారం అందజేస్తారు. సమావేశం ప్రారంభంలో హాజరైన సభ్యుల సంతకాలు రిజిస్టర్‌లో తీసుకుంటారు. అలాగే తీర్మానాలకు సంబంధించి కూడా సభ్యులు సంతకాలు చేయాల్సి ఉంటుంది. అయితే ఈ సమావేశంలో తాము హాజరైనట్టు మాత్రమే సంతకాలు చేశామని, తీర్మానాలకు సంబంధించి ఎలాంటి సంతకాలు చేయలేదని, తమకు వాటి గురించి తెలియదని మొత్తం 30 మంది కౌన్సిలర్లలో 19 మంది పేర్కొనడం చర్చనీయాంశమైంది.

## చైర్‌పర్సన్ ఏం చేస్తున్నట్టు..?

మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, పాలకవర్గం మధ్య సమన్వయం చేయాల్సిన బాధ్యత చైర్‌పర్సన్ ఆర్. సుహాసినిపై ఉంటుంది. అయితే కమిషనర్ అభివృద్ధి పనులు ఆమోదించినట్లు ప్రకటించగా, కౌన్సిలర్లు తమకు తెలియదని చెప్పడం పరిస్థితిని మరింత వివాదాస్పదంగా మార్చింది. ఒకవేళ ఇందులో ఏవైనా తేడాలు ఉంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని కౌన్సిలర్లు ప్రకటించడం గమనార్హం. అసలు అభివృద్ధి పనుల తీర్మానాలకు సంబంధించిన సంతకాలు సభ్యులు చేశారా లేదా అన్నది తేలాల్సి ఉంది. మరోవైపు, ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ కిషన్ ఎందుకు తొందరపడి ప్రకటన విడుదల చేశారన్న ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి.

## వైస్ చైర్‌పర్సన్ గరం గరం..!

మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఇద్దరూ అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే. గత సమావేశాల్లో వైస్ చైర్‌పర్సన్ గూడూరు అంజలిని వేదికపైకి ఆహ్వానించేవారు. అయితే తాజా సమావేశంలో ఆమెను వేదికపైకి పిలవకపోవడం చర్చనీయాంశమైంది. దీంతో అధికార కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లలోనే విభేదాలు ఉన్నాయన్న ప్రచారం సాగుతోంది. కొత్త పాలకవర్గం ఎన్నికై మూడు నెలలు కూడా గడవకముందే కౌన్సిలర్లలో విభేదాలు రావడం, అలాగే అధికారులు--కౌన్సిలర్ల మధ్య సమన్వయ లోపం మున్సిపల్ సమావేశంలో స్పష్టంగా కనిపించిందని రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి. మున్సిపల్ పాలకవర్గంలో నెలకొన్న విభేదాలు, అధికారులు--కౌన్సిలర్ల మధ్య సమన్వయ లోపం భవిష్యత్తులో ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందోనన్న ఆసక్తికర చర్చ ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో కొనసాగుతోంది.

# హుజురాబాద్‌లో మహిళా వారోత్సవాలు ఘనంగా నిర్వహణ



**హుజురాబాద్ టౌన్ మే 29 (పీపుల్స్ డైరీ) :**హుజురాబాద్ పట్టణంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న "1000 ఇంపార్టెన్స్ ప్రోగ్రాం"లో మహిళా వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి రొంటాల సుహాసిని మనోజ్ రావు గారు హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. అలాగే హుజురాబాద్ పట్టణంలోని 15 మహిళా సహాయక సంఘాలకు బ్యాంకు రుణాల మంజూరు, వాటి వినియోగం, మహిళల ఆర్థిక అభివృద్ధిపై పలు సూచనలు, సలహాలు అందించారు. మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగాలని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చైర్‌పర్సన్ సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ స్వరూప రాణి గారు, డీఎంసీ శివాని గారు, టీఎంసీ మల్లేశ్వరి గారు, ఏసీడీపీఓ ప్రవళిక గారు, డిప్యూటీ డీఎంహెచ్ఓ శ్రవణ్ కుమార్ గారు, వార్డు కౌన్సిలర్లు, మెప్మా విభాగ సిబ్బంది మరియు ఇతరులు పాల్గొన్నారు.

# నరసింహ స్వామి జయంతి వేడుకలు




**రేగొండ మే 29 పీపుల్స్ డైరీ :** రేగొండ మండలం కోటంచ ఆలయంలో శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. శుక్రవారం రోజున వేద పండితుల మంత్రచారాల నడుమ స్వామి వారి కి 108 కళాశాలతో ఆరాధన అభిషేకం జరిపించారు. ఆలయ మండపంలో శ్రీ సుదర్శన నరసింహ హోమం అభిషేకం, తీర్ద ప్రసాద గోష్టి నిర్వహించి సాయంత్రం నరసింహ అవతారా నామ సంకీర్తన శ్రీ స్వామి వారు స్తంభం నందు అవతరించు అనుకరణం శాంతి పాఠములు మంత్ర పుష్పము హారతి, సమర్పించి నివేదనం వినియోగ గోష్టి ఏకాంత సేవ లు చేసి చిన్న రథంలో స్వామి వారిని పురావిధుల గుండా ఊరేగించారు. శ్రీ లక్ష్మి నరసింహ జయంతి సందర్బంగా స్వామి వారిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం, తీర్ద ప్రసాదలు అందించారు. అదేవిదంగా వేసవి కాలం సందర్బంగా స్వామి వారిని దర్శించు కోవడానికి వచ్చిన భక్తులకు గ్రామనికి చెందిన వీరగోని కుమారస్వామి, సంధ్య ( కండక్టర్ ) గార్లు మజ్జిగ పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సంపత్ రావు,మాజీ జడ్పీ చైర్మన్ సాంబారి సమ్మారావు,మాజీ ఎంపీటీసీ ఎర్రబెల్లి రవీందర్ రావు, గ్రామ సర్పంచ్ మొగిలి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది భక్తులు పాల్గొన్నారు..

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఉమెన్స్ వీక్



**శంకరపట్నం మే:29 పీపుల్స్ డైరీ:** శంకరపట్నం మండలం లింగాపూర్ గ్రామంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ పద్మా ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఉమెన్స్ వీక్ ఉమెన్స్ వీక్ నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మోరే స్వరూప హాజరయ్యారు సూపర్వైజర్ పద్మ మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యత మరియు అనుబంధ పోషకహారం గురించి వివరించారు తల్లిదండ్రులు పిల్లల మధ్య ఉండవలసిన అనుబంధం గురించి చెప్పారు. పిల్లలతోప్రతి తల్లిదండ్రులు కొంత సమయము గడపాలని వారు సూచించారు చెప్పారు ఈ కార్యక్రమానికి విలేజ్ సెక్రటరీ అజయ్ కుమార్ వార్డ్ మెంబర్లు అంగన్వాడీ టీచర్లు ఆశాలు తల్లులు పాల్గొన్నారు.

# హుజురాబాద్ మున్సిపాలిటీలో రాజకీయ, పరిపాలనా పరిణామాలు చర్చనీయాంశం

**హుజురాబాద్ టౌన్ మే 28 (పీపుల్స్ డైరీ) :**హుజురాబాద్ మున్సిపాలిటీలో ఇటీవల చోటుచేసుకుంటున్న రాజకీయ, పరిపాలనా పరిణామాలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. ఇటీవల నిర్వహించిన మున్సిపల్ సమావేశానికి సంబంధించిన అంశాలపై చైర్‌పర్సన్ విడుదల చేసిన ప్రెస్‌నోట్ ప్రస్తుతం వివాదానికి దారితీసింది. చైర్‌పర్సన్ విడుదల చేసిన ప్రకటనలో సమావేశంలో మొత్తం 49 అంశాలకు ఆమోదం లభించిందని పేర్కొన్నారు. అయితే, ఈ విషయంపై మెజార్టీ కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. తమకు తెలియకుండా, తమ సమ్మతి లేకుండానే తీర్మానాలు ఆమోదించినట్లు ప్రకటించడం సరైంది కాదని వారు ఆరోపిస్తున్నారు. "మేము ఆ తీర్మానాలకు అంగీకరించలేదు. సమావేశంలో ఆ విధంగా నిర్ణయాలు జరగలేదు" అంటూ పలువురు కౌన్సిలర్లు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మెజార్టీ కౌన్సిలర్లు కలిసి సంతకాల సేకరణ చేపట్టినట్లు సమాచారం. సంబంధిత లఅధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైన వారు, తమ అభ్యంతరాలను అధికారికంగా నమోదు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. మొత్తానికి హుజురాబాద్ మున్సిపాలిటీలో అసలు ఏమి జరుగుతోంది..?తీర్మానాలు నిజంగానే ఆమోదించబడ్డాయా..?లేక రాజకీయ విభేదాల కారణంగా పరిపాలనా వ్యవస్థ గందరగోళంలో పడిందా..? ఈ వ్యవహారంపై అధికారుల స్పందన ఎలా ఉండబోతుందన్నది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.

# బిజిగిరీషరీఫ్ దర్గాను సందర్శించిన..

## హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి.



**జమ్మికుంట మే 29, పీపుల్స్ డైరీ :**జమ్మికుంట మండలం బిజిగిరీషరీఫ్ దర్గాను ఈరోజ హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా మత పెద్దలు, కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కి ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. దర్గా ప్రాంగణంలో ప్రార్థనలు నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే అక్కడి పరిస్థితులను పరిశీలించి, భక్తులకు అవసరమైన సౌకర్యాలపై మత పెద్దలతో మాట్లాడారు. బిజిగిరీషరీఫ్ దర్గా ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాముఖ్యత కలిగిన స్థలమని పేర్కొన్న ఎమ్మెల్యే , దర్గా అభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అన్ని మతాల పట్ల గౌరవ భావనతో ముందుకు సాగడం సమాజానికి ఎంతో అవసరమని అన్నారు. ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు అనుగుణంగా దర్గాలో మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, మత పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన..

## కౌన్సిలర్ నీరుగంటి శ్రీలత రమేష్ యాదవ్



**మేడ్చల్ మే 29 (పీపుల్స్ డైరీ):-** ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ కౌన్సిలర్ నీరుగంటి శ్రీలత రమేష్ యాదవ్ ప్రారంభించారు. స్థానిక ప్రజలు చాలా కాలంగా ఎదురుచూస్తున్న ఈ రహదారి పనులు ప్రారంభం కావడంతో వార్డు ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న రహదారి దెబ్బతినడంతో వర్షాకాలంలో బురద, గుంతల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు తెలిపారు. ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకొని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సీసీ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్లు కౌన్సిలర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ నీరుగంటి శ్రీలత రమేష్ యాదవ్ మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడం తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. వార్డులో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి వంటి సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.సీసీ రోడ్డు నిర్మాణంతో రాకపోకలు సులభతరం కావడంతో పాటు ప్రమాదాలు తగ్గే అవకాశం ఉందని స్థానిక ప్రజలు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# వరి కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ



**మేడ్చల్ మే 29 (పీపుల్స్ డైరీ):-** మూడుచింతలపల్లి మండలం కొల్తూరు గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ సుగుణా బాయి, జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ భిక్షం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కొనుగోలు కేంద్రంలోని సౌకర్యాలు, ధాన్యం నాణ్యతను పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తూకాలు సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చే రైతులకు తాగునీరు, నీడ వంటి కనీస వసతులు తప్పనిసరిగా కల్పించాలని సూచించారు. తూకం ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని, తూకం పూర్తయిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కేంద్రాల్లో టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధర రైతులకు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు.నిబంధనల ప్రకారం వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని సూచించిన అదనపు కలెక్టర్, రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ కొనసాగించాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక రెవెన్యూ సిబ్బంది, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు మరియు రైతులు పాల్గొన్నారు.

# జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడికి సన్మానం




**కరీంనగర్ ప్రతినిధి, మే 29 :** కరీంనగర్ జిల్లా కేంద్రంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రెండవ సారి కరీంనగర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులుగా నియమించబడిన కొర్వి అరుణ్ కుమార్ ని ఘనంగా సన్మానించిన కరీంనగర్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న వెంకటరాం రెడ్డి. ఈ కార్యక్రమంలో బిసి సెల్ అధ్యక్షులు పులి అంజనేయులు గౌడ్, కిసాన్ సెల్ అధ్యక్షులు పురం రాజేశం, మైనారిటీ సెల్ అధ్యక్షులు మహ్మద్ తాజ్, ఎస్టీ సెల్ అధ్యక్షులు శ్రవణ్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, కొత్తపల్లి మండల కిసాన్ సెల్ అధ్యక్షులు సిరిపురం నాగప్రసాద్, కరీంనగర్ జిల్లా యూత్ వైస్ ప్రెసిడెంట్ సిరిపురం లావణ్య, కరీంనగర్ జిల్లా యూత్ కాంగ్రెస్ మాజి అధ్యక్షులు అబ్దుల్ రహమాన్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ అబ్దుల్ అమీర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కూలీల వద్దకు బడిబాట

## యం.పీ.పీ.ఎస్ పాఠశాల ఉపాధ్యాయులు ఉపాధి హామీ



**సంగారెడ్డి ప్రతినిధి, మే 29 :** సంగారెడ్డి జిల్లా రాయికోడు మండలం పిపడప ల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి బడిబాటకార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి (ఎంఈఓ) నర్సీములు , కాంప్లెక్స్ హెచ్ఎం నగేష్ సార్ పాల్గొని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉత్తమ ఫలితాలు, నాణ్యమైన విద్య అందిస్తున్న విషయాన్ని తల్లిదండ్రులకు వివరించారు. ప్రతి చిన్నారిని బడికి పంపించి వారి భవిష్యత్తును తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వడ్ల రవి పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుర్గ భవాని , డేవిడ్,రాయికోడ్ ప్రాథమికపాఠశాల హెచ్ఎం శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ పద్మమ్మ, గ్రామ పెద్దలు సాజిత్, శ్రీను,ఈరన్న,సి ఆర్ పి రాజు, పాల్గొన్నారు.

# హుజురాబాద్ నియోజకవర్గ సమస్యలపైజిల్లా కలెక్టర్‌కు వినతి

## ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



**హుజురాబాద్ టౌన్ మే 29 (పీపుల్స్ డైరీ) :** హుజురాబాద్ నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి శుక్రవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా హుజురాబాద్ పట్టణం, జమ్మికుంట పట్టణం సహా నియోజకవర్గంలోని హుజురాబాద్, జమ్మికుంట, వీణవంక, ఇల్లంతకుంట, కమలాపూర్ మండలాల్లో నెలకొన్న తీవ్రమైన తాగునీటి సమస్యపై ఎమ్మెల్యే ప్రత్యేకంగా దృష్టి సారించారు. వేసవి తీవ్రతతో ప్రజలు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి ప్రతి గ్రామానికి, ప్రతి కాలనీకీ తాగునీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన దళితబంధు పథకం రెండో విడతను త్వరితగతిన ప్రారంభించి అర్హులైన లబ్ధిదారులకు అందించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. పేద కుటుంబాలకు ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ఆలస్యం చేయకుండా అమలు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.నియోజకవర్గ అభివృద్ధికి కీలకమైన వీణవంక మండల కేంద్రంలోని డబుల్ రోడ్డు, రాచపల్లి రోడ్డు, పోతిరెడ్డిపల్లి రోడ్డు, కోర్కల్ రోడ్డు, నాగంపేట రోడ్ల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ రోడ్ల దుస్థితి కారణంగా ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రైతులు పండించిన మక్కజొన్న కొనుగోళ్లలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే కోరారు. కొనుగోలు కేంద్రాల్లో సరైన సౌకర్యాలు కల్పించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలిపారు.అదేవిధంగా 2దీఎఖ ఇళ్ల పంపిణీని పూర్తిగా పారదర్శకంగా నిర్వహించి నిజమైన అర్హులైన పేద కుటుంబాలకు అందజేయాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో కూడా రాజకీయాలకు అతీతంగా నిజమైన పేదలను గుర్తించి ఎంపిక చేయాలని సూచించారు. హుజురాబాద్ పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న పలు స్థానిక సమస్యలను కూడా కలెక్టర్‌కు వివరించిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

# ఇదేనా ప్రజా పాలన అంటే-కొనుగోలు కేంద్రాల్లో ముక్కిపోతున్న వడ్లు

## కాకులమర్రి లక్ష్మణ్ బాబు



**ఏటూరు నాగారం మే 29 (పీపుల్స్ డైరీ/ :** రైతులను వంచించడమే 'ప్రజా పాలన' నా? కొనుగోలు కేంద్రాల్లో ముక్కిపోతున్న వడ్లను శుక్రవారం కాకులమర్రి లక్ష్మణ్ బాబు పరిశీలించారు. వరి ధాన్యం జిసిసి ఐకేపీ కేంద్రాన్ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ బాబు పరిశీలించారు. స్థానిక మంత్రికి రైతుల కష్టాలు పట్టవా? ఒక్క పూట వచ్చి చూసే తీరిక లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు ప్రభుత్వమని చెప్పుకుంటూ, క్షేత్రస్థాయిలో అన్నదాతలను వంచించడమే ప్రస్తుత ప్రభుత్వ "ప్రజా పాలన" నా? అని ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఏటూరు నాగారంలోని వరి ధాన్యం ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించి, గత 40 రోజులుగా ధాన్యం అమ్ముడు పోక నిరీక్షిస్తున్న స్థానిక రైతుల ఇబ్బందులను, వారి ఆవేదనను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాకులమర్రి లక్ష్మణ్ బాబు మీడియాతో మాట్లాడుతూ స్థానిక మంత్రి మరియు అధికార యంత్రాంగం వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి మాటలకే పరిమితం, చేతల్లో శూన్యం స్థానిక మంత్రి అధికారంలో ఉండి ఏవేవో పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారే తప్ప, ఇక్కడ రైతులు పడుతున్న అసలు ఇబ్బందులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. నిన్ననే ఈ ప్రాంతానికి వచ్చిన మంత్రి ఒక్క పూటైనా ఈ కొనుగోలు కేంద్రానికి వచ్చి రైతుల పరిస్థితిని కళ్లారా చూసే తీరిక లేదా? అని ప్రశ్నించారు. వచ్చి చూడకు ండానే వెళ్ళిపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. కొనుగోలు కేంద్రాల్లో నెల రోజులకు పైగా ధాన్యం నిల్వలు పేరుకుపోయి, అకాల వర్షాలకు తడిసి వడ్లన్నీ నల్లబడిపోతున్నాయని, ముక్కిపోతున్నాయని లక్ష్మణ్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. "రైతు పండించిన పంట కళ్ల ముందే పాడవుతుంటే, ఈ వడ్లను కొనే నాథుడే లేడా?" అని ఆయన ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. రైతాంగ పక్షాన పోరాటం ప్రజా పాలన పేరిట రైతులను అగచాట్ల పాలు చేయడం సరికాదని, తక్షణమే కొనుగోళ్ళు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు, పాలకులు స్పందించి యుద్ధప్రాతిపదికన తూకాలు వేసి మిల్లులకు తరలించకపోతే, బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని కాకులమర్రి లక్ష్మణ్ బాబు హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతిని ధులు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# చందాలు వేసుకొని భారీ డ్రైనేజీ మ్యాన్‌హోల్‌ను పునర్నిర్మించిన గ్రామస్తులు

## అధికారుల నిర్లక్ష్యానికి చెక్



**మేడ్చల్, మే 29(పీపుల్స్ డైరీ):-** నెలల తరబడి డ్రైనేజీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న కండ్లకోయ గ్రామ ప్రజలు చివరకు అధికారుల కోసం ఎదురుచూడకుండా స్వయంగా ముందుకు వచ్చి చందాలు సేకరించి భారీ డ్రైనేజీ మ్యాన్‌హోల్‌ను పునర్నిర్మించడం స్థానికంగా ప్రశంసలు అందుకుంటోంది. కండ్లకోయ గ్రామంలోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వెనుక ప్రాంతంలో ఉన్న ప్రధాన డ్రైనేజీ మ్యాన్‌హోల్ గత ఆరు నెలలుగా మూసుకుపోవడంతో మురుగునీరు రోడ్లపైకి పొంగిపొర్లుతూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. దుర్వాసన, దోమల బెడదతో పాటు అనారోగ్య సమస్యలు తలెత్తే పరిస్థితి నెలకొనడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారులు, మున్సిపల్ సిబ్బంది, ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఎలాంటి స్పందన లేకపోవడంతో గ్రామస్తులు, స్థానిక నాయకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. చందాలు సేకరించి నిర్మాణ సామగ్రిని సమకూర్చి, కార్మికులను ఏర్పాటు చేసి మూసుకుపోయిన డ్రైనేజీ మ్యాన్‌హోల్‌ను పూర్తిగా శుభ్రపరిచారు. అనంతరం దెబ్బతిన్న భాగాలను మరమ్మతు చేసి పునర్నిర్మాణ పనులు చేపట్టారు. గ్రామస్తుల శ్రమదానం, స్థానిక నాయకుల సహకారంతో చేపట్టిన ఈ పనుల ద్వారా డ్రైనేజీ నీటి ప్రవాహం సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. దీంతో నెలలుగా ఇబ్బందులు పడుతున్న ప్రజలకు తాత్కాలిక ఉపశమనం లభించింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరిం చాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహ రించడం బాధాకర మన్నారు. ప్రజల ఆరోగ్యం, భద్రతకు సంబంధిం చిన సమస్యను సైతం పట్టించు కోకపోవ డంతో గ్రామస్తులే తమ సొంత నిధులతో మ్యాన్‌హోల్‌ను పునర్నిర్మించు కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కండ్లకోయ గ్రామంలోని డ్రైనేజీ వ్యవస్థను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమం లో మాజీ నాయకుడు ఎస్. రాజేందర్, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు హరికృష్ణ, ప్రవీణ్ మహేందర్, గ్రామ యువకులు, కాలనీవాసులు మరియు కండ్లకోయ గ్రామ ప్రజలు పాల్గొని శ్రమదానం చేశారు.

# ప్రతి కుటుంబం ప్రారంభ బాల్య అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి

- పోషకాహారం, ఆరోగ్యం, ప్రారంభ విద్యపై తల్లిదండ్రులకు శిక్షణ
- జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు






**మేడ్చల్ మే 29 (పీపుల్స్ డైరీ):-** జిల్లా స్థాయిలో "ప్రజా ప్రభుత్వం కార్యక్రమం" మరియు "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక -- 99 రోజుల కార్యక్రమం"లో భాగంగా జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కుత్బుల్లాపూర్ ప్రాజెక్టు పరిధిలోని బాపూజీనగర్ సెక్టార్‌లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి శారద మాట్లాడుతూ, గర్భిణి అయిన నాటి నుండి పిల్లవాడికి తొలి రెండు సంవత్సరాల వరకు ఉండే "1000 రోజులు" బాలల బంగారు భవిష్యత్తుకు పునాదిగా నిలుస్తాయని తెలిపారు. గర్భధారణ నుండి రెండేళ్ల వయస్సు వరకు పిల్లల సమగ్ర అభివృద్ధి కోసం సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ప్రారంభ బాల్య సంరక్షణ మరియు అభివృద్ధి కార్యక్రమాల ద్వారా బాలల సంరక్షణ, పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణ మరియు సమగ్ర అభివృద్ధిపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. గర్భిణీలు, బాలింతలు మరియు చిన్నారుల తల్లిదండ్రులకు ఆరోగ్యకరమైన ఆహారం, పరిశుభ్రత, మానసిక మరియు శారీరక అభివృద్ధి అంశాలపై ప్రత్యేక శిక్షణలు అందిస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లల ఎదుగుదల, ఆరోగ్య పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ తల్లిదండ్రులకు అవసరమైన సూచనలు అందిస్తున్నామని వివరించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార ప్రదర్శనలు, తల్లిదండ్రుల సమావేశాలు, పిల్లల ఆటల కార్యక్రమాలు మరియు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.పిల్లల సమగ్ర అభివృద్ధికి అవసరమైన ఆరు ముఖ్య అంశాలైన పోషణ, ఆరోగ్యం, ప్రారంభ విద్య మరియు నేర్చుకోవడం, స్పందనాత్మక శిశు సంరక్షణ, భద్రత మరియు రక్షణ, తల్లిదండ్రుల శ్రేయస్సు వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా గర్భిణీలు మరియు బాలింతలకు పోషకాహారం తీసుకోవడం, తల్లిపాల ప్రాధాన్యత, పిల్లల ఎదుగుదల పర్యవేక్షణ, స్పందనాత్మక పేరెంటింగ్, ఆటల ద్వారా నేర్చుకోవడం, బాలామృతం వినియోగం మరియు హోమ్ విజిట్స్ ద్వారా అందించే సేవలపై వివరంగా తెలియజేస్తున్నామని తెలిపారు.పిల్లల ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం ప్రతి కుటుంబం ప్రారంభ బాల్య అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీడీపీవోలు, ఐసీడీఎస్ సూపర్వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణీలు, బాలింతలు, పిల్లల తల్లులు మరియు 7 నెలల నుండి 3 సంవత్సరాల లోపు చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

# బాల్య వివాహాలు బాలల అభివృద్ధికి గొడ్డలిపెట్టు

- ఏజెన్సీ ఏరియాలో 100 శాతం బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ కట్టుబడి ఉండాలి.
- ఐటీడీఏ అదనపు ప్రాజెక్టు అధికారి కొమురం నాగోరావు.
- పుత్తడి బొమ్మకు పుస్తెలు కాదు, పుస్తకాలు కావాలి,
- బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ సహకరించాలి.
- జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి ఈపి.ప్రేమలత.




**ఏటూరు నాగారం మే 29 (పీపుల్స్ డైరీ) :**99 రోజుల ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ములుగు జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దే లక్ష్యంతో "బాల్య వివాహం -- బతుకు ఆగం" అను నినాదంతో బాల్య వివాహాల నిర్మూలనపై బుధవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో వివాహాల నిర్వాహకులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.బిజిల్లా సంక్షేమ అధికారిణి ఈ.పి. ప్రేమలత అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో తాడ్వాయి, ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం, వాజేడు ఢ వెంకటాపురం మండలాలకు చెందిన పురోహితులు, ఖ్వాజీలు, పాస్టర్లు, టెంట్ హౌస్ నిర్వాహకులు, ఫోటోగ్రాఫర్లు, ఫ్లెక్సీ లు ముద్రించేవారు, క్యాటరింగ్ మరియు బ్యాండ్ మేళం నిర్వాహకులు తదితరులతో సమావేశం నిర్వహించారు. ఈ అవగాహన సదస్సుకు ఐటీడీఏ అదనపు ప్రాజెక్టు అధికారి కొమురం నాగో రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు ప్రాజెక్టు అధికారి కొమురం నాగో రావు మాట్లాడుతూ బాల్య వివాహాలు బాలల అభివృద్ధికి గొడ్డలిపెట్టు అని, బాల్య వివాహాలను అరిక డితేనే బాల బాలికల భవిష్యత్తుకు భరోసా లభిస్తుందని, ఏజెన్సీ ఏరియాలో 100 శాతం బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ కట్టుబడి ఉండాలని, తద్వారా అందరూ కలిసి సమిష్టిగా ములుగు జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని ఏ పీ ఓ కొమురం నాగో రావు అన్నారు. బాల్య వివాహాల సమాచారం ముందుగా తెలిసే అవకాశం పురోహితులు, ఖ్వాజీలు, పాస్టర్లు, టెంట్ హౌస్ నిర్వాహకులు, ఫోటోగ్రాఫర్లు మొదలగు వారికి ఎక్కువగా ఉంటుందని, వారు సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి బాల్య వివాహాలను అడ్డుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో సమాచారం ముందుగానే తెలిసే అవకాశం ఉన్నందున ప్రజల సహకారం ఉంటే జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. గ్రామస్థాయి నుంచి బాల్య వివాహాల నిర్మూలనపై విస్తృత అవగాహన కల్పించి సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాలికల చదువుకు ప్రాధాన్యత ఇవ్వాలని, చిన్న వయస్సులో వివాహాలు జరగడం వల్ల ఆరోగ్య సమస్యలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు.ఎబాల్య వివాహాల నిర్మూలనలో అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు, గ్రామస్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.అనంతరం జిల్లా సంక్షేమ అధికారిణి ఈ.పి. ప్రేమలత మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే సామాజిక, ఆరోగ్య, కుటుంబ పరమైన దుష్ప్రభావాలను వివరించారు. బాల్య వివాహాలు ఒక్క వర్గానికే పరిమితం కావని, అన్ని వర్గాల్లోనూ జరుగుతున్నాయని పేర్కొన్నారు. బాల్య వివాహాల నిర్మూలనలో వయస్సు నిర్ధారణ అత్యంత కీలకమని, వివాహాల నిర్వహణకు ముందు వయస్సు నిర్ధారణ పత్రాలను తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. అంతకు ముందు జిల్లా బాలల పరిరక్షణ అధికారి జె. ఓంకార్ బాల్య వివాహ నిరోధక చట్టం--2006 పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు నిర్వహించినా, సహకరించినా, ప్రోత్సహించినా సదరు భాధ్యులకు 2 సం.ల వరకు జైలు శిక్ష, 1 లక్ష రూపాయల జరిమానా విధించడం జరుగు తుందని వివరించారు. వరుడిపై నేరం ఆధారంగా పోక్సో కేసు కూడా అయ్యే ప్రమాదం ఉందని వివరించారు. చివరగా బాల్య వివాహ నిరోధక అధికారుల బాధ్యతలు, చట్టపరమైన నిబంధనలు తదితర అంశాలను వివరించారు. ములుగు జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్ది, బాలలకు స్నేహపూర్వకంగా మార్చుటకు అంతా కట్టుబడి ఉంటామని ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారి చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాల్గొన్నవారికి బాలల హక్కుల పరిరక్షణ చట్టాలపై రూపొందించిన వాల్ పోస్టర్లు, కర పత్రాలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వెంకటాపురం సిడిపిఓ కే.ముత్తమ్మ, ఆరు మండలాల నుండి బాల్య వివాహ రహిత గ్రామ పంచాయతీలు గా ఎంపిక చేసిన గ్రామపంచాయతీల సర్పంచ్ లు, కార్యదర్శులు, విసిపిసికన్వీనర్లు అయినా అంగన్వాడీ టీచర్లు, ఐ సి డి ఎస్ సూపర్వైజర్లు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది కృష్ణవేణి, హరికృష్ణ, సంజీవ, సుమన్, జ్యోతి, రాజు, నరేష్, డిహెచ్ఈడబ్ల్యూ సిబ్బంది, ఆరు మండలాల నుండి వచ్చిన పురోహితులు, ఖ్వాజీలు, పాస్టర్లు, టెంట్ హౌస్ నిర్వాహకులు, ఫోటోగ్రాఫర్లు, ఫ్లెక్సీ లు ముద్రించేవారు, క్యాటరింగ్ మరియు బ్యాండ్ మేళం నిర్వాహకులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లంపేట మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



మున్సిపల్ కమిషనర్‌కు సిఐటియు ఆధ్వర్యంలో వినతి

**మేడ్చల్ మే 29 (పీపుల్స్ డైరీ) :** ఎల్లంపేట్ మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటి యు మేడ్చల్ మండల కార్యదర్శి ఎం. నరేష్ మాట్లాడుతూ ఎల్లంపేట్ మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న కార్మికులకు ఈ నెలకు సంబంధించిన జీతాలు ఇప్పటివరకు చెల్లించకపోవడం వల్ల వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వెంటనే పెండింగ్ జీతాలను విడుదల చేసి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుండి ఇప్పటివరకు కార్మికులకు అందించాల్సిన బట్టలు, చెప్పులు, సబ్బులు, సరుపులు, నూనె, గ్లౌజులు, చీపురు కట్టలు వంటి మౌలిక సదుపాయాలను కల్పించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న కార్మికుల భద్రత, ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని అవసరమైన అన్ని సామగ్రిని వెంటనే అందించాలని కోరారు.ఈ సమస్యలపై స్పందించిన ఎల్లంపేట మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ, కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాలను రెండు రోజుల్లో చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అలాగే కార్మికులకు అవసరమైన మౌలిక సదుపాయాలను 15 రోజుల్లో పూర్తి స్థాయిలో అందిస్తామని తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి అధికారులు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కార్మికులు కోరుతున్నారు.

# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు

- జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



**మేడ్చల్ మే 29 (పీపుల్స్ డైరీ):-** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్ రెడ్డి ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ, దేశంలోనే తొలిసారిగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల బాధితులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించి అందించే నిర్ణయం తీసుకున్న తెలంగాణ ప్రభుత్వాన్ని అభినందించారు. ఈ నిర్ణయం సామాజిక న్యాయానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.ప్రతి నెల 25వ తేదీన తహసీల్దార్లు తప్పనిసరిగా "సివిల్ రైట్స్ డే" సమావేశాలను నిర్వహించాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశాలకు అన్ని శాఖల అధికారులు హాజరై ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించిన కుల ధృవీకరణ పత్రాలను ఆలస్యం లేకుండా జారీ చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. పోలీసు శాఖ అధికారులు పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. జిల్లాలో ఒక్కరే పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉండడం వల్ల కేసుల విచారణలో ఆలస్యం జరుగుతోందని, మరో పీపీ నియామకానికి కమిషన్ చొరవ తీసుకోవాలని కోరారు. మూడు నెలలకు ఒకసారి డివిజన్ స్థాయిలో సమావేశాలు నిర్వహించి పెండింగ్ కేసులను క్లియర్ చేయాలని సూచించారు. సఫాయి కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించిన అదనపు కలెక్టర్, వారికి ఆరోగ్య శిబిరాలు నిర్వహించడంతో పాటు పీపీఈ కిట్లు, రక్షణ పరికరాలను క్రమం తప్పకుండా అందించేందుకు మున్సిపల్ కమిషనర్లు, జోనల్ కమిషనర్లకు కలెక్టర్ ద్వారా లేఖలు పంపుతామని తెలిపారు. అలాగే ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం రిజర్వేషన్ అమలు దిశగా చర్యలు తీసుకోవాలని డీఈఓను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ మాట్లాడుతూ, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాను కమిషన్ దత్తత తీసుకుందని తెలిపారు. అట్రాసిటీ కేసుల బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. కేసులు నమోదు అయిన వెంటనే బాధితులకు నిబంధనల మేరకు నష్టపరిహారం అందించాలన్నారు. ఇటీవల అద్రస్ పల్లిలో జరిగిన శ్రీరామ నవమి కార్యక్రమంలో దళితులకు ఆలయ ప్రవేశం నిరాకరించిన ఘటనపై కమిషన్ జోక్యం చేసుకుని ఇరువర్గాల మధ్య చర్చలు జరిపి సమస్యను పరిష్కరించామని తెలిపారు. ఈ ఘటనలో నమోదైన అట్రాసిటీ కేసులను కూడా పరస్పర అవగాహనతో వెనక్కు తీసుకునేలా చర్యలు తీసుకున్నామని, ఇందులో పోలీసుల పాత్ర కీలకమని పేర్కొన్నారు.పౌరహక్కుల రక్షణ చట్టం, అట్రాసిటీ నివారణ చట్టంలను కచ్చితంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. బాధితులకు డబల్ బెడ్ రూమ్ ఇళ్లతో పాటు ఉపాధి, పెన్షన్ వంటి సంక్షేమ పథకాలు అందించేందుకు రెవెన్యూ శాఖ సహకరించాలని కోరారు. సమావేశంలో కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, డీఆర్ఓ మాలతి, ఆర్డీఓలు రాజేష్ కుమార్, శ్యాంప్రకాష్, పోలీసు అధికారులు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, డివిఎంసి సభ్యులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి వార్డు వారిగా సర్పంచ్ పర్యటన

**దమ్మపేట, మే 29 :**సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు శుక్రవారం 9వ వార్డులో ప్రజల సమస్యలను గుర్తించి, పరిష్కారం కొరకు కార్యదర్శి బండి అనంత కుమార్, 9 వ వార్డు సభ్యులు గోళ్ళ భవాని కృష్ణ యాదవ్ తో కలిసి కొత్తపేటలో వీధి వీధిన తిరిగారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను తెలుసుకుని తత్వర పరిష్కారం కోసం సంబంధిత సిబ్బందితో పనులు చేయించారు. ముఖ్యంగా మురుగునీటి కాలవలు, మంచినీరు నల్లాలో నెమ్మదిగా రావడం, సిమెంట్ రోడ్డు అంచుకు కంచె వేసి క్లాత్ కట్టి రోడ్డు టర్నింగ్ కనపడకుండా చేయడం, పాడు పడిన ఇండ్లను వదిలేసి చెత్త పెంచడం, రోడ్డు ప్రక్కన చెత్త వేసి ప్రదేశాలను కలుషితం చేయడం, రోడ్డు పై పుల్లలు, ఇంటి నిర్మాణ మెటీరియల్, మట్టి పోసి ఆక్రమించడం, మురుగు నీరు, వర్షపు నీరు వెళ్ళకుండా ఇండ్ల ముందు ర్యాంప్ లు, ఇండ్ల పైకి వాలి ఉన్న చెట్లు తదితర ప్రధాన సమస్యలను గుర్తించి సంబంధిత వారికి వెంటనే తీయాలి అని లేని పక్షంలో పంచాయతీ వారు జే.సి.బి పెట్టి శుభ్రం చేయిస్తాం అన్నారు. పెన్షన్ పెట్టుకునే వారిని అప్లై చేసుకోవాలని, పెన్షన్ తీసుకునే వారు లైవ్ ఫోటో దిగని వారిని లైవ్ ఫోటో తీయించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, దారా రాము, బత్తుల సాయి,



రూపా రాంబాబు మరియు చిన్నశెట్టి ముక్తేశ్వరరావు, పిట్టల శ్రీనివాసరావు, సిబ్బంది పగడాల గోపి, కాకాని గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# భరత నాట్యంలో భళా.. సహస్ర..



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, మే 29 :** అమ్మాయికి 12 సంవత్సరాల వయస్సు మాత్రమే, కానీ భరత నాట్యంలో అదరగొడుతోంది, అందరి చేత భళా అనిపించు కుంటుంది. ఈ విశ్వంలో అంద రిలా కాకుండా మనకంటూ ప్రత్యేక గుర్తింపు అమృత పుత్రిక అదే పేరును సార్ధకం చేసుకోవడమే నిత్య జీవితంలో గొప్ప విజయమని శ్రీరాముడు చెప్పిన మాటలను నిజం చేస్తూ అతి ప్రాచీన నృత్యకళలోని ఒకటైన భరత నాట్యంలో అదరగొట్టే భరత నాట్య ప్రదర్శణలు ఇస్తూ వీక్షకులను మంత్రముగ్ధులను చేసి వారి ఆశీర్వాదాలతో సహస్ర భళా అనిపించుకుంటున్న చిన్నారిపై ప్రత్యేక కథనం. సిద్దిపేట పట్టణానికి చెందిన గూడ సహస్ర 7వ తరగతి చుదువుతుంది. సహస్రకు చిరుప్రాయం నుంచే చదువు, నృత్యంపై ఎంతో మక్కువ. భక్తి చానెల్లో వచ్చే నృత్య ప్రదర్శనలు ఆసక్తిగా తిలకిస్తూ వారు చేసే విదంగా చేయడానికి ప్రయత్నించేది. ఇది గమనించిన తల్లిదండ్రులు సహస్రను ఓ నాట్య గురువు వద్ద శిక్షణకు చేర్పించారు. దానిని సద్వినియోగం చేసుకున్న చిన్నారి భరత నాట్యంలోని మెలకువలను అవపోసన పట్టి ఒంట పట్టించుకుంటుంది. నిత్యం సమయం దొరికినప్పుడల్లా గురువు వద్ద నేర్చుకున్న నృత్యం సాధన చేస్తుంది. అయోధ్యలోని శ్రీరాముని చెంత తన ప్రదర్శణ ఇచ్చి ఆరంగేట్రం చేయాలని ఆ చిన్నారి తన మనసులోని కోరికను వెల్లడించింది. చిన్నారి సహస్ర కోరిక త్వరలోనే నెరవేరాలని ఆమెకు బెస్ట్ ఆఫ్ లక్ చెబుదాం.

# క్షయ వ్యాధిని తరిమికొడదాం

**డిప్యూటీ డిఎంహెచ్ ఓ. శ్రీనివాస్**



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, మే 29 :** టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రిలో క్షయ వ్యాధిపై వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి ముఖ్య అతిథిగా ఉప వైద్యాధికారి డాక్టర్ ఎన్. శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ క్షయ వ్యాధి బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి సలహాలను సూచించారు. రెండు వారాలకు మించి దగ్గు, రాత్రిపూట చెమటలు పట్టడం, బరువు తగ్గడం, తెమడలో రక్తం పడటం, చాతిలో పట్టేసినట్టు ఉండడం ఇలాంటి లక్షణాలు ఉన్నప్పుడు దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి విచ్చేసి తగు పరీక్షలు చేయించుకొని మందులు వాడాల్సిందిగా సూచించారు. ఈ వైద్య శిబిరంలో 30 మందికి డిజిటల్ ఎక్స్ రే పరీక్షలు నిర్వహించి తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ శ్రీనివాస్, సీనియర్ టీబి ట్రీట్మెంట్ సూపర్వైజర్ శ్రీనివాస్, రేడియో గ్రాఫర్ వికాస్, ల్యాబ్ టెక్నీషియన్ సాయి తదితరులు పాల్గొన్నారు.

# దళిత జర్నలిస్ట్ పై దాడి

**దాడి చేసిన ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని ఎస్పీకి ఫిర్యాదు**



**సంగారెడ్డి ప్రతినిధి, మే 29 :** మనూర్ మండల పరిధిలోని అతిమ్యాల్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు మహేశ్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ దళిత జర్నలిస్టు ఫోరం నాయకులు సంగారెడ్డి ఎస్పీకి ఫిర్యాదు చేశారు. వార్త సేకరణకు వెళ్లిన రిపోర్టర్ రాములుపై మార్చి 17న ఉపాధ్యాయుడు దాడి చేశారని ఆరోపించారు. ఈ ఘటనలో సహకరించిన గ్రామస్థులపైనా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సంగారెడ్డి ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ పరితోష్ పంకజ్‌కు ఉమ్మడి మెదక్ జిల్లా దళిత జర్నలిస్టు ఫోరం అధ్యక్షుడు రాపాక విజయరాజు వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టులపై దాడులు ఆందోళన కలిగిస్తున్నాయని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వారి వెంట తెలంగాణ ఆల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దత్తు రెడ్డి, జర్నలిస్టు సాయిలు ఉన్నారు.

# బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ కు ఘన సన్మానం



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి మే 29న:** బ్యాంక్ ఆఫ్ ఇండియా బాలానగర్ శాఖ కొత్త మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన రంజు థామస్‌ను శుక్రవారం రంగారెడ్డి నగర్ ప్రాంతానికి చెందిన చిన్నతరహా పారిశ్రామికవేత్తలు, మానస టూల్ టెక్ అధినేత, ప్రముఖ కవి వాకిటి రామ్‌రెడ్డి, గీతానగర్ సూక్ష్మ, చిన్నతరహా ప్రతినిధి ఉపేందర్ రెడ్డి బాలానగర్‌లోని బ్యాంక్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వాకిటి రామ్‌రెడ్డి మాట్లాడుతూ బ్యాంక్ ఆఫ్ ఇండియా చిన్నతరహా పరిశ్రమలకు విరివిగా ఋణాలు మంజూరు చేస్తూ తెలంగాణ పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నదని, అర్హత, నైపుణ్యం కలిగిన ప్రతి నిరుద్యోగికి ఋణాలు ఆర్థిక స్వావలంబనకు దోహదపడుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా క్రెడిట్ మేనేజర్ సుధాకర్, సిబ్బంది సునిత పాల్గొన్నారు. వినియోగదారులకు, పారిశ్రామికవేత్తలకు అందిస్తున్న సేవలకు బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ మేనేజర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## హుజురాబాద్ కాంగ్రెస్ సన్నాహక సమావేశంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



**హుజురాబాద్ ప్రతినిధి, మే 29 :** కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త కూన శ్రీశైలం గౌడ్ ఆధ్వర్యంలో హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశం స్థానిక హుజురాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఒడితల ప్రణవ్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ హుజురాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి స్థానిక నాయకులు కృషి చేయాలని సూచించారు. గ్రామ, మండల కమిటీలను బలోపేతం చేయాలని, కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టబోయే కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న సర్ కార్యక్రమంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని, ఓట్ల తొలగింపు జరగకుండా చూడాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులందరూ ఓటు హక్కును నమోదు చేసుకునే విధంగా కృషి చేయాలని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు, ఆరు గ్యారంటీలను ప్రజాక్షేత్రంలోకి తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ కాంగ్రెస్ ఇంచార్జ్ ఒడితల ప్రణవ్, మున్సిపల్ చైర్మన్ సుహాసిని, వైస్ చైర్మన్ అంజలి, వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జూన్ 21న తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం

**ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి**



**మేడ్చల్ మే 29 (పీపుల్స్ డైరీ) :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారుల హక్కులు, సంక్షేమం, గుర్తింపు వంటి అంశాలను ప్రధానంగా ప్రస్తావిస్తూ ఈ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఉద్యమకారులకు ప్రభుత్వం నుంచి తగిన గౌరవం, భరోసా అందాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డా. పిడమర్తి రవి ఆధ్వర్యంలో మేడ్చల్‌లో జరిగిన సన్నాహక సమావేశంలో సమ్మేళనం పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన, తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులకు 250 గజాల ప్రభుత్వ స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర సాధనలో తమ జీవితాలను అంకితం చేసిన ఉద్యమకారులకు ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో గ్రామాల నుంచి పట్టణాల వరకు వేలాది మంది యువకులు, విద్యార్థులు, ప్రజాసంఘాలు పోరాటాల్లో పాల్గొన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రం ఏర్పడి సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ, చాలా మంది ఉద్యమకారులు ఇంకా ఆర్థిక, సామాజిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఉద్యమకారుల ఐక్యతను చాటుతూ వారి సమస్యలపై చర్చించేందుకు ఆత్మీయ సమ్మేళనం వేదిక కానుందని పేర్కొన్నారు. జూన్ 21న జరిగే ఈ సమ్మేళనానికి రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ ఉద్యమకారులు పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ఇప్పటికే పలు ప్రాంతాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తూ ఉద్యమకారుల హక్కుల సాధన కోసం సమిష్టిగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు పసలా ఫిలిప్స్, మారేపల్లి సుధాకర్, గుండే కుమార్, గుండే ఎల్లయ్య, రాజకుమార్, నరసింహ, సురేష్ కుమార్ తదితరులు పాల్గొని సమ్మేళనం విజయవంతానికి సహకరించాలని కోరారు.

## బిజిగిరి దర్గాను అభివృద్ధి చేస్తాం..ప్రణవ్

**దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించి,చాధర్ సమర్పించిన ప్రణవ్.**



**జమ్మికుంట మే 29 పీపుల్స్ డైరీ :** జమ్మికుంట మండల పరిధిలోని బిజిగిరి షరీఫ్ దర్గాలో ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ పేర్కొన్నారు. శుక్రవారం రోజున బిజిగిరి షరీఫ్ దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం చాధర్ సమర్పించారు. ఈ సందర్భంగా దర్గా కమిటీ వారు ఘన స్వాగతం పలికారు. కరీంనగర్ జిల్లా నుండే కాక ఇతర జిల్లాల నుండి పెద్ద ఎత్తున భక్తులు వచ్చి ఈ దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని,దర్గాను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ప్రణవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేస్తున్న కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం

- **హసన్ పర్తి మండలంలో వరుస అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**



**హసన్ పర్తి, మే 29 (పీపుల్స్ డైరీ) :** హసన్ పర్తి మండల పరిధిలోని సీతానాగారం, సుదనపల్లి, పెంబర్తి గ్రామాల్లో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు మరియు కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డితో కలిసి పలు అభివృద్ధి పనులను ప్రారంభించి, శంకుస్థాపనలు చేశారు. సీతానాగారం గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్డును ఎమ్మెల్యే నాగరాజు గారు ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి నాణ్యమైన మౌలిక వసతులు అత్యంత అవసరమని పేర్కొన్న ఆయన, రహదారుల అభివృద్ధితో ప్రజల రాకపోకలు సులభతరం కావడంతో పాటు విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు కూడా మేలు జరుగుతుందని అన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. అనంతరం సుదనపల్లి గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు మరియు అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్ధే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నాగరాజు పేర్కొన్నారు. సీసీ రోడ్డు వల్ల గ్రామ ప్రజలకు రాకపోకలు సౌకర్యవంతంగా మారడంతో పాటు వర్షాకాల ఇబ్బందులు తగ్గుతాయని తెలిపారు. కొత్త అంగన్‌వాడీ భవనం ద్వారా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు మెరుగైన సేవలు అందుతాయని, చిన్నారుల ఆరోగ్యకర ఎదుగుదలలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఇక పెంబర్తి నుంచి అంబాల గ్రామం వరకు రూ.1.50 కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే నాగరాజు శంకుస్థాపన చేశారు. గ్రామాల మధ్య మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు ఆర్థిక కార్యకలాపాలు వేగవంతం అవుతాయని తెలిపారు. ఈ రహదారి నిర్మాణంతో రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు సులభంగా తరలిం చగలరని, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొ న్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి అభివృద్ధి ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఎమ్మెల్యే నాగరాజు హామీ ఇచ్చారు. ప్రజల సంక్షేమం, గ్రామాల సమగ్రాభివృద్ధే తన ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పిఆర్టియూ ఆధ్వర్యంలో ఉత్తమ విద్యార్థులకు అవార్డుల ప్రధానోత్సవం

- **ముఖ్య అతిథిగా హాజరై అవార్డులను అందజేసిన మంత్రి శ్రీహరి**
- **ఎస్ఎస్సిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మంత్రి సన్మానం..**




**నారాయణపేట జిల్లా ప్రతినిధి, మే 29 :** నారాయణ పేటలో పీఆర్టియు ఆధ్వర్యంలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు అవార్డుల ప్రధానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఎస్సిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను మంత్రి శ్రీహరి సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీహరి మాట్లాడుతూ అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు పిఆర్టియు ఆధ్వర్యంలో అవార్డ్స్ ఇవ్వడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని, ప్రయివేట్ స్కూల్లలో కన్నా ప్రభుత్వ పాఠశాలలోనే గురువులు నాణ్యమైన విద్య అందిస్తారని తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణత శాతంలో గతంలో కన్నా నారాయణపేట జిల్లా 19 నుండి 14 కు ఎగబాకిందని, రాబోయే రోజుల్లో 1వ స్థానానికి రాణించేలా కృషి చేయాలని కోరారు. గతంలో పాఠశాలలు తెరిచినా బుక్స్ ఆలస్యంగా వచ్చేవని, కానీ ఇప్పుడు స్కూల్ తెరిచిన వెంటనే బుక్స్, షూస్, బ్యాగులు ఇస్తున్నామని గుర్తు చేశారు. కాస్మోటిక్ చార్జెస్, డైట్ చార్జెస్ పెంచామ న్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. అలాగే ఎస్ఎస్సి తర్వాత వచ్చే ఆరు సంవత్సరాలు ఉపాధ్యాయుల తల్లిదండ్రుల మాట విని ఉన్నత స్థాయికి ఎదగాలి ఆకాంక్షించారు. ఈ రాష్ట్ర పౌరుల తలరాత మార్చే బాధ్యత ఉపాధ్యాయుల చేతుల్లో ఉందని, ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థుల ఫొటోలు ఫ్లెక్సీలో పెట్టిస్తే మిగతా విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశ్యంతో పదోన్నతులు, బదిలీలు చేపట్టడం జరిగిందని అన్నారు. ప్రభుత్వ బడులను బలోపేతం చేయాల్సిన బాధ్యత మనందరి పైన ఉందని, వెనుకబడిన పాలమూరు జిల్లా నుండి వచ్చిన రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని, కావున ఈ ప్రాంతంలో మక్తల్-నారాయణపేట -కొడంగల్ ఎత్తిపోతల పథకం నిర్మిస్తున్నామని అన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే 1.5 లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతుంది. తద్వారా ఆర్థిక స్థితిగతులు బాగుపడి విద్యావ్యవస్థ కూడా బాగుపడుతుంది. దేశంలో ఎక్కడా లేనివిధంగా ప్రాజెక్టు కట్టకముందే భూ నిర్వాసితులకు ఎకరాకు 20 లక్షల చొప్పున ఇచ్చామని అన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక, జిల్లా విద్యా శాఖ అధికారి గోవింద రాజులు, పిఆర్టియూ రాష్ట్ర అధ్యక్షులు దామోదర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు జనార్దన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకట్ రెడ్డి, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత**

- **రైస్ మిల్లుల వద్దా ధాన్యం వెంటనే అన్లోడింగ్ చేయాలి..**



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, మే 29 :** జగిత్యాల జిల్లా రాయికల్ మండలం మైతాపూర్ గ్రామంలోని ప్యాక్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రం, రాయికల్ మండలం లోని శివమని రైస్ మిల్లును శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాలలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేగంగా కొనుగోలు ప్రక్రియను కొనసాగించాలని అధికారులకు సూచించారు. కేంద్రాలలో హమలీలు తగిన సంఖ్యలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ధాన్యం లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేసి లారీలను ఆలస్యం లేకుండా మిల్లులకు తరలించాలని ఆదేశించారు. అలాగే ట్రక్ షీట్ నమోదు, ట్యాబ్ ఎంట్రీలు వంటి అన్ని డాక్యుమెంటేషన్ పనులను సమయానికి పూర్తి చేయాలని, ఎలాంటి పెండింగ్ లేకుండా చూడాలని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాలలో పారదర్శకత పాటించడంతో పాటు రైతులకు సరైన సమాచారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు సమయంలో తేమ శాతం, నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పరిశీలించాలని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి అవకతవకలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను హెచ్చరించారు. అనంతరం రైస్ మిల్లులను తనిఖీ చేసి మిల్లర్లు హమాలీల సంఖ్య పెంచాలని ధాన్యం తో వచ్చిన లారీలను 24 గంటల్లోగా అన్లోడ్ అయ్యే విధంగా చూడాలని రైస్ మిల్లర్లు అధికా రులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకొని ధాన్యం కొనుగోళ్లు సజావుగా, వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ధాన్యం అన్లోడింగ్ లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగార్జున, నాయబ్ తహసీల్దార్ , సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, కేంద్రల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వర ముక్తేశ్వర దేవస్థానం డైరెక్టర్‌గా తాటిపల్లి రాజన్న

**బండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘన సన్మానం**



**హుజురాబాద్ టౌన్ మే 29 (పీపుల్స్ డైరీ) :** జయశంకర్ భూ పాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం నూతన డైరెక్టర్‌గా హుజురాబాద్‌కు చెందిన తాటిపల్లి రాజన్న నియమితులయ్యారు. ఈ సందర్భంగా హుజురాబాద్ పట్టణంలోని హైస్కూల్ క్రీడా మైదానంలో శుక్రవారం ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై, తాటిపల్లి రాజన్నకు శాలువా కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తాటిపల్లి రాజన్న మాట్లాడుతూ, ప్రతిష్టాత్మకమైన కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవాలయ డైరెక్టర్‌గా అవకాశం కల్పించిన రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. స్వామివారి ఆశీస్సులతో, దేవస్థానం పాలకవర్గ సభ్యుల సహకారంతో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని, భక్తులకు మరింత మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు శాయశక్తులా పనిచేస్తానని తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమానికి హుజురాబాద్‌కు చెందిన వివిధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరై రాజన్నకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిప్రసాద్, కార్యదర్శి మతిన్, రిటైర్డ్ అధికారులు కొండె రాజిరెడ్డి, వేల్పుల రత్నం, పలకల ఈశ్వర్ రెడ్డి, కౌన్సిలర్ ఇల్లందుల సమ్మయ్య, బండ కిషన్, బింగి తిరుపతి, ఇల్లందుల తిరుపతి, కొలిపాక సమ్మయ్య, కుడికాల ప్రభాకర్, పాక సతీష్, ఉప్పు శ్రీనివాస్ పటేల్, మార్త రవీందర్, వెంపటి సతీష్, వేల్పుల ప్రభాకర్, సాయి, మక్కపల్లి రమేష్, కొలిపాక శ్రీనివాస్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ కేసరి పత్రికా రిపోర్టర్ కేసరి మధుకర్ రావు పాల్గొని నూతన డైరెక్టర్‌కు అభినందనలు తెలిపారు. తాటిపల్లి రాజన్న నియామకంపై హుజురాబాద్ నియోజకవర్గ ప్రజలు, వివిధ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# పైప్ కల్వర్ట్ పనులను ప్రారంభించిన సర్పంచ్ బావు సంపత్

**వీణవంక మే 29( పీపుల్స్ డైరీ) :** బొంతుపల్లి గ్రామంలో పైప్ కల్వర్ట్ పనులను సర్పంచ్ బావు సంపత్,ఉప సర్పంచ్ ప్రారంభించారు. ఈసందర్భంగ సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామంలోని వివిధ అభివృద్ధి పనులకు గాను నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వ పెద్దల దృష్టికి 2024 నవంబర్ 23 న తీసుకుపోగా,ఎనిమిది లక్షల పైప్ కల్వర్ట్ కు 2025 సెప్టెంబర్ 18న,మంజూరవగా అట్టి పనిని ఈరోజు ప్రారంబించడం జరిగింది. ఈ కల్వర్ట్ 60. ఎకరాల వ్యవసాయ భూములకు వెళ్లడానికి ఉపయోగపడుతుందనీ బావు సంపత్ అన్నారు. మాజీ ఉప సర్పంచ్ చదువు జితేందర్ రెడ్డి మాట్లాడుతూ ఇట్టి పని మంజూరు చేసిన ప్రభుత్వానికి, హుజురాబాద్ పార్టీ ఇంచార్జ్ ప్రాణవ్ బాబుకు రైతుల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీలకతీతంగా గ్రామంలో సమగ్ర అభివృద్ధి చేసుకోవాలనేదే మాఆలోచన అని,సమగ్ర అభివృద్ధిలో భాగంగా కానీసం 50 లక్షల నిధులు మంజూరు చేయాలనీ ప్రభుత్వ పెద్దలను కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చదువు నర్సింహా రెడ్డి పంచాయతీ కార్యదర్శి కే రజిత



కాంగ్రెస్ నాయకులు చదువు జైపాల్ రెడ్డి, రైతులు తాటికొండ గోవిందా చారి, రమేష్, పొన్నాల లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ మద్దతు ధరల జీవో దగ్ధం




**మట్టెవాడ, మే 29 (పీపుల్స్ డైరీ) :** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై ఈనెల 27 నుండి 31 వరకు నిరసన కార్యక్రమాలు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్.కెఎం) జాతీయ వేదిక ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం నగరం లోని కాశిబుగ్గ అంబేద్కర్ జంక్షన్లో కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో ప్రతులను రైతు సంఘాల నాయకులు దగ్ధం చేశారు. ప్రధాని మోడీ నాయకత్వంలోని ఆర్థిక వ్యవహారాల ఉప సంఘం ఈ ఖరీఫ్ సీజన్లో 14 రకాల వ్యవసాయ పంటలకు కనీస మద్దతు ధరలను ప్రకటించిందని ఇవి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా లేవని రైతు సంఘాల నాయకులు అన్నారు. మోడీ ప్రభుత్వం తాము అధి కారంలోకి వస్తే స్వామినాథన్ సిఫార్సుల అనుగుణంగా కనీస మద్దతు ధరలు అమలు చేస్తామని ప్రకటించి ఈరోజు నామ మాత్రపు మద్దతు ధరలు ప్రకటించిందని వారు విమ ర్శించారు. రోజు రోజుకు విత్తనాలు, రసాయనిక ఎరువులు, పురుగు మందులు, డీజిల్, సాగునీరు, విద్యుత్ ధరలు పెరుగుతుంటే వాటిని అరికట్టడంలో వైఫల్యం చెంది రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నదని సంఘాల నాయకులు దుయ్యబట్టారు. కేంద్రం మొక్కజొన్నకు రూ.10, వరికి రూ.72, పత్తికి రూ.557 మద్దతు ధర పెంపుగా ప్రకటించిందని ఇది తెలంగాణ రాష్ట్రంలో రైతులు పండించిన పంట నుండి పడేసే తాలు కంటే అధ్వాన్నమన్నారు. పత్తికి 11,000, వరికి 3,500, మొక్కజొన్నకు రూ.3,000గా మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య, ఆల్ ఇండియా కిసాన్ సంఘ్ జిల్లా కన్వీనర్ సుధమల్ల భాస్కర్, అఖిలభారత సంయుక్త కిసాన్ సభ జిల్లా అధ్యక్షులు వల్లందాస్ కుమార్, బండి వెంకటేశ్వర్లు, బొల్లు ఎల్లయ్య పాల్గొన్నారు.



## చిరు వ్యాపారుల తొలగింపు బాధాకరం!

**మట్టెవాడ, మే 29 (పీపుల్స్ డైరీ) :** చిరు వ్యాపారుల అడ్డాలను రోడ్డుపై నుంచి తొలగించడం బాధాకరం. వారి జీవన భృతికి ప్రభుత్వ పెద్దలు సహాయం చేయాలని ఆ సంఘం అధ్యక్షులు గజ్జెల లింగమూర్తి కోరారు. వరంగల్ నగరంలో శుక్రవారం చిరువ్యాపారస్థుల సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అధ్యక్షులు గజ్జెల లింగమూర్తి, సభ్యులు ఎం.అరుణ, సరోజన, శోభ, రాజేశ్వరి, స్రవంతి, లక్ష్మి, స్వప్న, అరుణ తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సంఘం అధ్యక్షులు లింగమూర్తి మాట్లాడుతూ వరంగల్ నగరంలోని హెడ్ పోస్ట్ ఆఫీస్ ప్రాంతంలో రోడ్డుకు ఇరుపక్కల చిన్నచిన్న వ్యాపారాలు చేస్తున్న వ్యాపారులను దౌర్జన్యంగా తొలగించడం సరికాదని తెలిపారు. వాళ్ళ బతుకులకు భద్రత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుకు ఇరుపక్కల చిన్న చిన్న వ్యాపారాలు చేస్తూ ఎవ్వరిపై ఆధార పడకుండా ఎండకు వానకు చలిని సైతం లెక్క చేయకుండా కుటుంబ పోషణకై ఆరాటపడుతూ బ్రతుకుతున్న వారికి దయాహృదయంతో ప్రభుత్వ పెద్దలు సహాయం అందివ్వాలని లింగమూర్తి విజ్ఞప్తి చేశారు.

## పెద్దనాగారం స్టేజిలో సీసీ కెమెరాల ఏర్పాటు



**నర్సింహులపేట, మే 29 (పీపుల్స్ డైరీ):** మండలంలోని పెద్దనాగారం స్టేజి గ్రామంలో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేస్తూ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నూతన సీసీ కెమెరాలను శుక్రవారం ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ భూక్య సోనియా హరిలాల్, ఎస్సై భానోత్ వెంకన్న కలిసి సీసీ కెమెరాలను ప్రారంభించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన రెండు సీసీ కెమెరాల విలువ సుమారు రూ.25 వేలు ఉంటుందని తెలిపారు. గ్రామ భద్రత దృష్ట్యా సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన సర్పంచ్, పాలకవర్గ సభ్యులను ఎస్సై వెంకన్న అభినందించారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల దొంగతనాలు, అనుమానాస్పద ఘటనలను సులభంగా గుర్తించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రవిబాబు, వార్డు సభ్యులు జగ్గు, పద్మ వెంకన్న, శాంతమ్మ, జయపాల్ రెడ్డి, నాయకులు సప్పిడి వెంకటరెడ్డి, బాణాల ప్రవీణ్, సోమయ్య, భూక్య చందు, మార్క వెంకన్న, గుగులోతు నరేష్, చలమల్ల శ్రీను, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళా సంక్షేమానికి పెద్దపీట

### పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

**ఆత్మకూర్, మే 29 (పీపుల్స్ డైరీ) :** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో మహిళ సాధికారత, సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. మహిళా శక్తి వారోత్సవాల సందర్భంగా మండలంలోని అగ్రంపహాడ్ గ్రామంలో అంగన్వాడి భవనాన్ని హనుమకొండ జిల్లా అధ్యక్షులు, కుడా చైర్మన్ ఇనుగాల వెంకటరామిరెడ్డితో కలిసి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్న ప్రసన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాది అంగన్వాడీలని, గ్రామీణ ప్రాం తాల్లో మహిళలు, బాలల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధిక ప్రాధా న్యత ఇస్తుందని అన్నారు. అంగన్వాడి కేంద్రాలు చిన్నారుల విద్యాభివృద్ధికి, గర్భిణీలు, బాలింతల ఆరోగ్య పరిరక్షణ కు ఎంతో కీలకమని తెలిపారు. ప్రీ ప్రైమరీ స్కూల్లు ఏర్పాటు చేయబోతు న్నామని, డైట్ చార్జెస్ పెంపు, అత్యాధుని క విద్యా ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. మహిళల సాధికారతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. పిల్లలకు పోషకాహారం, ప్రాథమిక విద్య, ఆరోగ్య సేవలు అందించే దిశగా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్య వైద్యానికి అధిక ప్రాధాన్యత



ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరకాల ఆర్డీఓ డిఎస్ వెంకన్న, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ, వార్డు సభ్యులు, ఐసీడీఎస్ అధికారులు, సూపర్ వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయా వర్గాల మహిళలు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ముమ్మరంగా ఆసరా పెన్షన్ల ఆధార్ అథెంటికేషన్



**నర్సంపేట, మే 29 (పీపుల్స్ డైరీ) :** నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని 26వ డివిజన్ శివనగర్ జయశ్రీ టాకీస్ వెనుక గల జి.ఆర్. గార్డెన్‌లో శుక్రవారం ఆసరా పెన్షన్ లబ్ధిదారుల ఫేస్ రికగ్నైజేషన్ (ముఖ గుర్తింపు), ఆధార్ అథెంటికేషన్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. స్థానిక కౌన్సిలర్ మండల శ్రీదేవి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి డివిజన్ పరిధిలోని వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, బిడి కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వార్డ్ ఆఫీసర్, బిల్ కలెక్టర్లు ప్రత్యేక యాప్ ద్వారా లబ్ధిదారుల ఫోటోలను సేకరించి, ఆధార్ వివరాలను అనుసంధానం చేశారు. ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు జరిగిన ఈ ప్రక్రియలో లబ్ధిదారులు తమ ఒరిజినల్ ఆధార్ కార్డులతో పాల్గొని బయోమెట్రిక్, ఫేస్ అథెంటికేషన్ పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మండల శ్రీదేవి శ్రీనివాస్ మాట్లాడుతూ... ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆసరా పెన్షన్లు క్రమం తప్పకుండా అకౌంట్లలో జమ కావాలంటే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఈ అథెంటికేషన్ పూర్తి చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని, ఈ ప్రక్రియ పూర్తి కాని పక్షంలో పెన్షన్ నిలిపివేయబడే అవకాశం ఉన్నందున డివిజన్ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారని కౌన్సిలర్ మండల శ్రీదేవి శ్రీనివాస్ తెలిపారు ఈ యొక్క అవకాశాన్ని పట్టణంలోని ప్రతి ఒక్కరు జూన్ 15 వ తేదీ లోగా సద్వినియోగం చేసుకోవాలని కోరినారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, వార్డ్ ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు మరియు డివిజన్ ముఖ్య నాయకులు వేల్పుల కన్నయ్య, నాడెం రామకృష్ణ, గుండబోయిన శివకోటి, దోనాల రవి, ఇరగదిన్ల పెంచలయ్య, మార్త శంకర్, మండల సత్యనారాయణ, మండల సంతోష్, సంఘ రమేష్, ప్రజలు పాల్గొన్నారు.

## సమాజసేవకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి!

### ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి




**మట్టెవాడ, మే 29 (పీపుల్స్ డైరీ) :** మన జిల్లాని మనం అభివృద్ధి పరుచుకుందాం, కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ బిలిటీ కింద కార్పొరేట్ సంస్థలు, వ్యాపారవేత్తలు, సామాజి క స్పృహ కలిగిన వ్యక్తులు ముందుకు రావాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఓ సామాజిక అంశం గురించి మాట్లాడడా నికి కేయూ పాలకమండలి సభ్యురాలు డాక్టర్ కె.అనితారెడ్డి ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డితో చర్చించారు. కిరాయి ఇండ్లలో ఉన్నప్పుడు ఎవరైనా చనిపోతే ఇంటి ఓనర్లు శవాన్ని ఇంట్లో పెట్టడానికి ఒప్పుకోకపోవడం తో కిరాయి దారులు నానా బాధలు పడుతున్నారని ఆ ఇబ్బందిని గమనించి ప్రముఖ వ్యాపార వేత్తలు పి.ఎన్.మూర్తి, మహేంద్ర కపూర్, డాక్టర్ అనితారెడ్డి ఇతర వ్యాపారస్తులు అందరూ కలిసి సోషల్ రెస్పాన్స్ బిలిటీ కింద పద్మాక్షమ్మ గుడి దగ్గరలోని శ్మశాన వాటికలో స్థలం చూపిస్తే ఉచితంగా బిల్డింగ్ కట్టి ఇస్తామని తరువాత మెయింటెనెన్స్ కూడా చేస్తామని ముందుకురాగా నాయిని రాజేందర్ రెడ్డి అభినందించి, వెంటనే ఎంతో చొరవ తీసుకుని కలెక్టర్ చాహత్ వాజ్ పాయ్ వద్దకు స్వయంగా తీసుకొని వెళ్లి చర్చించడం జరిగింది. జిల్లా కలెక్టర్ కూడా ఈ విషయంపై సానుకూలంగా స్పందించి అభినందించారు. నిజంగా ఇది బర్నింగ్ సమస్య అని, దీనివలన ఎందరో వేదనను తగ్గించిన వారమవుతామని అన్నారు. ప్రతి ఒక్కరూ ఈ విధంగా ఆలోచిస్తే అభివృద్ధిలో హన్మకొండ జిల్లా ముందుంటుందని తొందరలో స్థలం చూపిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పి.ఎన్. మూర్తి, మహేంద్ర కపూర్ తదితరులు పాల్గొన్నారు.

## మండలాధ్యక్ష పదవికి పోటీ హోరాహోరీ

### నలుగురు ఆశావహుల లాబీయింగ్ ముమ్మరం

### ఎమ్మెల్యే నిర్ణయంపై ఉత్కంఠ



**నర్సింహులపేట, మే 29 (పీపుల్స్ డైరీ) :** నరసింహులపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి ఎంపిక స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. మండల పార్టీ పగ్గాలు చేపట్టేందుకు నలుగురు నాయకు లు తీవ్రంగా ప్రయత్నాలు సాగి స్తుండటంతో కాంగ్రెస్ వర్గాల్లో ఆసక్తికర పరిస్థితులు నెలకొన్నా యి. అధిష్టానం త్వరలోనే నియామకాన్ని ప్రకటించే అవకాశం ఉందన్న ప్రచారంతో ఆశావహులు తమ రాజకీయ సమీకరణాలను వేగవంతం చేశారు. ఈ రేసులో ఓ యువ నేత, మాజీ సర్పంచ్‌తో పాటు ఇద్దరు సీనియర్ నాయకులు ఉన్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. యువతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని, క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేసే సామర్థ్యం తనకుందని యువనేత వర్గం ప్రచారం చేస్తోంది. మరోవైపు గ్రామీణ స్థాయిలో బలమైన పట్టుతో పాటు ప్రజలతో సత్సంబంధాలు ఉన్నాయని మాజీ సర్పంచ్ తన అనుచరుల ద్వారా అధిష్టానం దృష్టికి తీసుకెళ్తున్నారు. ఇద్దరు సీనియర్ నేతలు మాత్రం పార్టీ కష్టకాలంలోనూ జెండా మోసిన తమ సేవలను గుర్తించి ఈసారి పదవి తమకే ఇవ్వాలని పట్టుదలగా ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్నేళ్లుగా పార్టీ కోసం కష్టపడుతున్న తమను పక్కనబెడితే కార్యకర్తల్లో తప్పుదోవ పడే అవకాశముందని వారు భావిస్తున్నట్లు సమాచారం. మండలా ధ్యక్షుడి ఎంపికలో స్థానిక ఎమ్మెల్యే అభిప్రాయానికే ప్రాధాన్యం ఉండనున్న నేపథ్యంలో ఆశా వహులంతా ఆయనను ప్రసన్నం చేసుకునే ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. నియోజ కవర్గ స్థాయి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ తమ బలాన్ని చాటుకునేందుకు పోటీ పడుతు న్నారు. అయితే నలుగురు నేతలకూ వేర్వేరు వర్గాల్లో బలం ఉండటంతో ఎవరికి అవకాశం కల్పించాలనే అంశంపై ఎమ్మెల్యే ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. ఒకరికి పదవి దక్కితే మిగిలిన వారిలో అసంతృప్తి పెరిగే అవకాశం ఉండటంతో సమీకరణాలపై విస్తృతం గా చర్చిస్తున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచు కుని మండలంలో వర్గ విభేదాలు తలెత్తకుండా అందరినీ సమన్వయం చేసే నాయకత్వాన్ని ఎంపి క చేయాలనే దిశగా అధిష్టానం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. దీంతో చివరకు కాంగ్రెస్ మండలాధ్యక్ష పీఠం ఎవరిని వరించనుందన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తిగా మారింది.

# ఓటర్ల హక్కులను కాపాడటం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యత

**ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తోంది**

**ప్రతి బూత్‌లో కాంగ్రెస్ శక్తిని మరింత విస్తరించేందుకు కృషి చేయాలి**

**కాంగ్రెస్ సిద్ధాంతాలు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి**

**ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి**

**ఆత్మకూర్, మే 29(పీపుల్స్ డైరీ) :** ఓటర్ల హక్కులు కాపాడడం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యతను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. ఆత్మకూరు మండలం గుడెప్పాడ్ క్రాస్ రోడ్డు వద్ద గల ఎన్ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్ నందు నిర్వహించిన పరకాల నియోజక వర్గ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ బూత్ ఏజెంట్స్ శిక్షణ కార్యక్రమంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కుడా చైర్మన్ ఇనుగాల వెంకటరామిరెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండి అయుబ్ తో కలిసి పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అ ప్రక్రియ, ఓటర్ల జాబితా నిర్వహణ, బూత్ స్థాయి బాధ్యతలపై ఎంపీ శ్రీమతి కడియం కావ్య సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఓటర్ల జాబితా నిర్వహణ, బూత్ స్థాయి అధికారుల బాధ్యతలు ఎన్నికల ప్రక్రియలో వారి పాత్రపై సమగ్ర అవగాహన కల్పించారు. కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న విధానాలు, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి అని, స్థానిక ఓటర్లతో మంచి సంబంధాలు ఏర్పరచుకుని, వారి సమస్యలపై అవగాహన కలిగి ఉండాలన్నారు కేంద్ర ఎన్నికల సంఘం (జుజ×) లేదా పార్టీ నిర్వహించే శిక్షణా తరగతులకు తప్పనిసరిగా హాజరై నిబంధనలు తెలుసుకోవాలి. ఓటరు జాబితాలో అక్రమాలు, దొంగ ఓట్ల చేరికలను ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ "ఓటు చోరీ" పేరుతో దేశవ్యాప్తంగా, ముఖ్యంగా తెలంగాణలో పెద్ద ఎత్తున ప్రచార ఉద్యమాన్ని చేపట్టింది అన్నారు. అధికార బీజేపీ, ఎన్నికల సంఘం కుమ్మక్కై ఓట్లను తొలగిస్తున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ ఈ కార్యక్రమాన్ని ఉధృతం చేసింది. ఓట్లను తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ తెలంగాణ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ భారీ ఎత్తున ఊరూరా సంతకాల సేకరణ యుద్ధాన్ని ప్రారంభించింది అన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జూన్ 25 నుండి తెలంగాణలో 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' మూడో దశ ఓటరు నమోదు, జాబితా సవరణ కార్యక్రమం ప్రారంభం కానుంది అని అన్నారు. ఈ సర్వే ద్వారా ఇంటింటికీ బూత్ లెవెల్ అధికారులు (దీూాలు) తిరిగి అర్హులైన కొత్త ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, మార్పులు చేపట్టనున్నారు అని తెలిపారు. మీకు కేటాయించిన నిర్దిష్ట నియోజకవర్గం లేదా బూత్ వివరాలను బట్టి, ఏవైనా డూప్లికేట్ ఓట్లు ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే మీ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జికి లేదా స్థానిక పార్టీ కమిటీకి సమాచారం అందించాలి అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు






# కరెంటు కోతలు.. ప్రజల వెతలు

## కరెంటు అధికారులపై ప్రజల అసహనం - కూలిన చెట్లు విరిగిన కరెంటు స్తంభాలు



**చిట్యాల, మే 29 (పీపుల్స్ డైరీ) :** కరెంటు కోతలతో జనం బేజారవుతున్నారు. వానాకాలం రాకముందే విపరీతమైన కరెంటు కోతలు ఉండడంతో మండల కేంద్రంతో పాటు మండలంలోని ప్రజలు కరెంటు అధికారుల పనితీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల మంగళవారం కురిసిన వానకు ఈదురు గాలులకు మండలంలో పలు చెట్లు నేలకూలాయి. కరెంటు స్తంభాలు వంగి కరెంటు వైర్లు తెగి రోడ్డు మీద పడి ప్రజలకు వాహనదారులకు ప్రమాదకరంగా మారాయి. అసలే ఎండాకాలం ఒక్క నిమిషం కరెంటు పోయినా ఉక్కపోత దోమల బెడద నిద్రలేమితో ప్రజలు ఇబ్బంది పడే పరిస్థితి వస్తుంది. ఈ ఎండాకాలంలో చిట్యాల మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో కరెంటు ఎప్పుడు పోతుందో ఎప్పుడు వస్తుందో తెలియడం లేదని ప్రజలు వినియోగదారులు ఆరోపణలు గుప్పిస్తున్నారు. మండలంలో అప్రకటిత కరెంటు కోతలతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. అసలే ఎండ కాలం కావడంతో రాత్రిపూట ఉక్క పోత బాధతో పిల్లలు వృద్దులు ప్రజలు ఇబ్బంది పడే అవకాశం ఉంటుంది కాబట్టి రాత్రి పగలు అనే తేడా లేకుండా కరెంటు పలుసార్లు పోవడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అదేవిధంగా మండలంలోని పలు గ్రామాల్లో అనధికారిక విద్యుత్ కోతలు విధిస్తుండడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. విద్యుత్ మరమ్మతుల పేరుతో రోజులో అనేకసార్లు కరెంటు కోతలు ఉండడంతో మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని షాపుల నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కరెంటు ప్రతిసారి వస్తు పోతూ ఉండడంతో జిరాక్స్ ఇంటర్నెట్ తదితర షాపుల నిర్వాహకుల యంత్రాలు పాడయ్యే అవకాశం ఉంటుం దని వారు వాపోతున్నారు. మండలంలోని పలు దళిత కాలనీలలో పొద్దంతా అసలు కరెంటు ఉండడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. చిన్నగా గాలి వీచిన కరెంట్ కట్ అవుతుంది. కరెంటు లేకపోవడంతో ఉక్కపోత సమస్యతో చిన్నపిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. భారీ స్థాయిలో అనధికారిక కరెంటు కోతలు విధిస్తుండడంతో ప్రజలు విద్యుత్ అధికారులపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. అదేవిధంగా గ్రామాల్లో పూర్తిస్థాయిలో కరెంటు సమస్యలను పరిష్కరించకుండా కరెంట్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో కరెంటు కోతలను నివారించాలని నిరంతరం నాణ్యమైన విద్యుత్ ను సరఫరా చేయాలని వినియోగదారులు ప్రజలు కోరుతున్నారు.



## ప్రత్యేక పూజలు, భక్తులకు పండ్ల పంపిణీ

**మట్టెవాడ, మే 29 (పీపుల్స్ డైరీ) :** కొండా దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా నర్సంపేట్ రోడ్డులోని కనకదుర్గ మాత దేవాలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు అనంతరం టిపిసిసి కార్యదర్శి మీసాల ప్రకాష్ ఆధ్వర్యంలో భక్తులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మీసాల ప్రకాష్ మాట్లాడుతూ ఆదర్శ దంపతులు జన హృదయ నేతలు రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు దంపతుల వివాహ మహోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు, అర్చనలు, భక్తులకు బాటసారులకు పెద్ద ఎత్తున పండ్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కొండా దంపతుల అభిమానులు దేవాలయాల్లో పూజలు, చర్చిలలో, మసీదులలో, గురుద్వార్లో ప్రార్థనలు చేయడం జరిగిందన్నారు. కొండా దంపతులు ఆయురారోగ్యాలతో అష్ట ఐశ్వర్యాలతో సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ కార్యక్రమాలు చేసినట్లు మీసాల వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జారతి రమేష్, కాంటెస్టెడ్ కార్పొరేటర్ క్యాతం రవీందర్, పప్పు వేణు, ఎర్ర రవి, కాంగ్రెస్ నాయకులు సందెల లాజర్, జంగం ప్రభాకర్, ఎర్రం కమల్, పోలేపాక విశాల్ బాబు, బూర మహేందర్, మిట్టపల్లి సాంబయ్య, బల్ల సదానందం, సర్దార్ జస్వీర్ సింగ్, కంచర్ల వేణు, నాగరాజ్, యాకూబ్, రాజేందర్, ఠాగూర్ బజరంగ్ సింగ్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు గూడ శారద, రమ్య, గాయత్రి, స్వప్న, పద్మ, శ్రీదేవి, సుజాత, స్వరూప రాణి పాల్గొన్నారు.



## చేయూత పింఛన్లు పెంచి ఇవ్వాలి

**మారపల్లి మల్లేష్**

**చిట్యాల, మే 29(పీపుల్స్ డైరీ) :** ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు చేయూత పింఛన్లు పెంచి జూన్ 2 నుండి ఇవ్వాలని అలాగే రెండు లక్షల కొత్త పింఛన్లు కూడా అర్హులైన కొత్త వారికి ఇవ్వాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేష్ అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రం లోని అంబేద్కర్ సెంటర్లో మాట్లాడుతూ గత ప్రభుత్వం అమలు చేసిన వికలాం గులకు రూ. 4016లు వృద్దులు వితంతువులు ఒంటరి మహిళలు తదితర వారికి ఇస్తున్న రూ. 2016లు కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వికలాంగులకు 6 వేలు వృద్దులు ఇతరులకు 4 వేలు ఇస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని జూన్ 2 నుండి పెంచిన పింఛన్లు అమలు చేస్తూ కొత్త పింఛన్లను మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందే విధంగా పనిచేయాలి

**భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**



**చిట్యాల, మే 29 (పీపుల్స్ డైరీ) :** భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆదేశాల మేరకు శుక్రవారం నిర్వహించిన చిట్యాల మండలం యూత్ కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన గండ్ర సత్యనారాయణ రావు మరియు భూపాలపల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బండ శ్రీకాంత్ ఆదేశాల మేరకు చిట్యాల మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అల్లకొండ కుమార్ ఆధ్వర్యంలో చిట్యాల మండల యూత్ కాంగ్రెస్ కమిటీ మరియు అన్ని గ్రామ కమిటీ అధ్యక్షుల నియామకాల. పత్రాలను శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు చేతుల మీదుగా అందజేయడం జరిగింది. అనంతరం ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ ప్రజా పాలనలో రేవంత్ రెడ్డి నాయకత్వంను బలపరుస్తూ ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందే విధంగా పనిచేయాలని పార్టీ బలోపేతం కోసం పనిచేయాలని రేపు రాబోయే రోజుల్లో జరగబోయే స్థానిక సంస్థల ఎలక్షన్లో యూత్ కాంగ్రెస్ ముందంజలో ఉండి ప్రతి ఒక్క కార్యకర్త ఒక సైనికుడిల పని చేయాలన్నారు. ప్రతి ఒక్క కార్యకర్తను కంటికి రెప్పల కాపాడుకుంటాను అన్నారు. ఈ కార్యక్రమంలో నూతనగా ఎన్నికైన మండల ఉపాధ్యక్షులు గోల్కొండ నాగరాజ్ ఎలగొండ చిరంజీవి అధికార ప్రతినిధి చెట్కూరి రాజ్ మండల కార్యదర్శి ఏకు కిషన్ బద్రి కోశాధికారి ఈరగోని రాజు అమరేందర్ సోషల్ మీడియా ఇన్చార్జ్ బలగు నీలేష్ తిరుమలాపూర్ యూత్ అధ్యక్షుడు కాల్వచర్ల రాంబాబు చల్లగరీగ యూత్ అధ్యక్షులు కట్ల మహేష్ జడలు పేట యూత్ అధ్యక్షులు మెరుగు వెంకటేష్ గోపాలపురం యూత్ అధ్యక్షులు పిసరి రాజేష్ దూద్ పల్లి యూత్ అధ్యక్షులు పోశాల కుమార్ వెంచరామీ యూత్ అధ్యక్షులు అందుగుల రాజు భావుసింగ్ పల్లె జయ్యారపూ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు అరటి పండ్ల పంపిణీ



**గోవిందరావుపేట, మే 28 (పీపుల్స్ డైరీ) :** మండల పరిధిపసర గ్రామపంచాయతీ ఉపాధి హామీ కూలీలకు శుక్రవారం ములుగు జిల్లా బి ఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ గ్రంథాలయ చైర్మన్ పోరిక గోవింద నాయక్ అరటి పండ్లు పంపిణీ చేశారు, ఈ సందర్భంగా గోవింద్ నాయక్ మాట్లాడుతూ తీవ్రమైన ఎండలు (46 డిగ్రీలు) వడగాలులను సైతం లెక్కచేయకుండా ప్రాణాలను ఫణంగా పెట్టి ఉపాధి హామీ పనులకు వెళ్తున్న వారికి ఎండ దెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తగు సూచనలు చేసిన గోవింద్ నాయక్, ప్రభుత్వం కూడా ఉపాధి హామీ కూలీలకు గతంలో టెంటు ఏర్పాటు చేసేవారని, పనిముట్లకు డబ్బులు చెల్లించేవారని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వం కూలీల బాగోగులను గాలికి వదిలేశారని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో సర్పంచులు మాలోత్ గాంధీ బానోతు సీతారాం,మాజీ ఎంపీటీసీలు చందులాల్,వెలిశాల స్వరూప, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పూర్ణచందర్, చెరుకు ప్రవీణ్ కుమార్, వెలిశాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## గడ్డం కేశవమూర్తికి పద్మశాలి నేతల సన్మానం

**పద్మశాలీల సమస్యల సాధన కోసం కలిసి రావాలి : జిల్లా అధ్యక్షులు ఆనందం**



**హనుమకొండ, మే 29 (పీపుల్స్ డైరీ) :** హనుమకొండ టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షునిగా నూతనంగా ఎన్నికైన గడ్డం కేశవ మూర్తికి తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం జిల్లా, రాష్ట్ర కమిటీ నేతలు కండువాతో ఘనంగా సన్మానించారు.ఇటీవల జరిగిన హనుమకొండ జిల్లా టి యూడబ్ల్యూజే (ఐజేయు) యూనియన్ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలుపొందిన గడ్డం కేశవమూర్తి హనుమకొండలోని ఆయన పత్రికా కార్యాలయంలో పద్మశాలి సంఘం నేతలు ఘనంగా సన్మానించి,శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో ఉన్నత పదవులు అలంకరించి అటు జర్నలిస్టు సంఘానికి, ఇటు పద్మశాలి సమాజానికి సేవలు అందించాలని జిల్లా అధ్యక్షులు బచ్చు ఆనందం కోరారు. ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, జర్నలిజంలో తనకంటూ ప్రత్యేకత చాటుకున్న కేశవమూర్తి కి పద్మశాలి సంఘం తరఫున అండగా ఉంటామన్నారు.రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైద్య రాజగోపాల్ మాట్లాడుతూ గత మూడున్నర దశాబ్దాలుగా జర్నలిజం రంగంలో రాణిస్తున్న కేశవమూర్తి పద్మశాలి కులానికి వన్నెతెచ్చారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పులికంటి రాజేందర్, జిల్లా ఉపాధ్యక్షులు నల్ల సత్యనారాయణ, భద్రకాళి దేవాలయం ధర్మకర్త బింగి సతీష్ ఉన్నారు.

## గంగపుత్ర విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలి

**కన్నం సత్యనారాయణ గంగపుత్రను సత్కరించిన టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర**




**హైదరాబాద్, మే 29 (పీపుల్స్ డైరీ) :** హైదరాబాద్ జిహెచ్ఎంసి పరిధిలోని చార్మినార్ జోనల్ కమిషనర్గా ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన కన్నం సత్యనారాయణ గంగపుత్రను తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి, వరంగల్ గంగపుత్ర హౌసింగ్ సొసైటీ డైరెక్టర్ టుంగుటూరి రాజేష్ ఖన్నా శుక్రవారం మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర మాట్లాడుతూ కన్నం సత్యనారాయణ గంగపుత్ర నిరుపేద సంప్రదాయ మత్యకార కులములో జన్మించి ఈ స్థాయికి ఎదగడం శుభపరిణామన్నారు. రానున్న రోజులలో సామాజిక కార్యక్రమాలతో పాటు వయో వృద్ధులు మరియ ప్రతిభ కలిగిన నిరుపేద గంగపుత్ర విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తూ మరింత ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు.

## గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను విజయవంతం చేయాలి

**రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మల్లయ్య**



**చిట్యాల, మే 29(పీపుల్స్ డైరీ) :** టేకుమట్ల మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సంఘం ఆవిర్భావ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను జరుపుటకై మండల కన్వీనర్ మారేపల్లి కొమురయ్య అధ్యక్షతన శుక్రవారం పిఎంఆర్ గార్డెన్ లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా అంబేద్కర్ ఫెలోషిప్ నేషనల్ అవార్డు గ్రహీత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పుల్ల మల్లయ్య విచ్చేసి మాట్లాడుతూ అంబేద్కర్ యువజన సంఘం ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకుందని దానిని పురస్కరించుకొని గ్రామాలలో కూడా అంబేద్కర్ యువజన సంఘం ఆవిర్భావ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. సెప్టెంబర్ 21, 1977 న సంఘం ఆవిర్భవించడం జరిగిందని నాటి నుండి నేటి టీవరకు 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్నందున గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల వేడుకలను ఘనంగా జరపాలని పిలుపునిచ్చారు. గ్రామాలలో కూడా అంబేద్కర్ యువజన సంఘాలను బలోపేతం చేయాలని చెప్పారు. సెప్టెంబర్ 21న హైదరాబాదులో జరిగే ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు గ్రామ మండల జిల్లాల నుండి అధిక సంఖ్యలో కుల మతాలకు అతీతంగా బడుగు బలహీన వర్గాలైన ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ కులాల వారు అంబేద్కర్ వాదులు మేధావులు శ్రేయోభిలాషులు వివిధ సంఘాల రాజకీయ పార్టీల నాయకులు అధిక సంఖ్యలో హాజరై గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. అలాగే గ్రామ మండల జిల్లాలో కూడా ఆవిర్భావ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం భూపాలపల్లి నియోజకవర్గ కన్వీనర్ ఆరకొండ రాజయ్య మండల ఉపాధ్యక్షులు పారనంది రాములు మండల నాయకులు అరకొండ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలి

**ఎస్.ఐ.ఆర్. కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించాలి**

**ప్రతి ఇంటికి బీఎల్వో చేరుకొని పూర్తి స్థాయిలో పరిశీలన చేయాలి**

**రాజకీయ పార్టీలతో నిరంతరం సమన్వయం కొనసాగించాలి**

**ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంపై జిల్లా అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**




**ఖమ్మం, మే 29 (పీపుల్స్ డైరీ) :** ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ద్వారా ప్రతి ఓటరు వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలిస్తూ, మ్యాపింగ్ ప్రక్రియ మరింత వేగవంతంగా చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అంశంపై జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ పి.శ్రీజ, మున్సిపల్ కార్పోరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి ఇప్పటివరకు చేపట్టిన మ్యాపింగ్ వివరాలను మండలాల వారీగా పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ... ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని, ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియలో బీఎల్ఓల పని తీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, లక్ష్యాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ఖచ్చితమైన ధృవీకరణ, సరైన డేటా నమోదు, పారదర్శకతతో పని చేయాలన్నారు. ఎస్ఐఆర్ లో భాగమైన మండలాలు, కార్పోరేషన్, మున్సిపాలిటీ సంబంధించి ప్రతి ఓటర్లను మ్యాపింగ్ చేసే విధంగా టార్గెట్ పెట్టుకొని వంద శాతానికి చేరుకోవాలన్నారు. ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ ప్రక్రియను జూన్ 24 నుంచి జులై 25 వరకు చేపట్టనున్నా రన్నారు. ఫారం-6, 7, 8 ద్వారా వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించాలని, మరణించిన ఓటర్ల వివరాలను ధృవీకరించి, తొలగింపు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. బదిలీ ఓటర్లు, మరణించిన ఓటర్ల వివరాలను సక్రమంగా పరిశీలించి, రికార్డులను నవీకరించాలని తెలిపారు. ఓటర్లు అందరూ ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమంలో పాల్గొని సరైన వివరాలు అందించేలా తద్వారా ఖచ్చితమైన ఓటరు జాబితా తయారీలో రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోరారు.ఎస్ఐఆర్ కార్యక్రమం ద్వారా శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లు, మరణించిన ఓటర్ల వివరాల తొలగింపు, డబుల్ ఎంట్రీలతొలగింపు జరుగుతుందని తెలిపారు. జూన్ 25 నుండి జూలై 24 వరకు బూత్ లెవల్ అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను పూర్తి స్థాయిలో ధృవీకరించాలని ఆదేశించారు. ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని, ప్రతి అర్హమైన ఓటరుని గుర్తించి జాబితా లో చేర్చాలని తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా సిద్ధం చేసే ముందు ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఒక కుటుంబ సభ్యులందరూ ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉండేలా చూడాలని, 1200 మంది ఓటర్ల సంఖ్య దాటితే కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రతి బీఎల్వో వద్ద ఎన్యుమరేటర్ ఫారాలు తగినంతగా అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. ప్రతి బీఎల్వోకు ఎస్ఐఆర్ నిబంధనలు, విధి విధానాలు, ఫీల్డ్ వెరిఫికేషన్ విధానం, ఫారాల నిర్వహణపై పూర్తి అవగాహన, పట్టు ఉండేలా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. శిక్షణ కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు. ముసాయిదా జాబితా ప్రచురణ అనంతరం ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలు, కొత్త క్లెయిమ్‌లు, దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి మాత్రమే నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రతి దరఖాస్తుపై ఫీల్డ్ స్థాయిలో విచారణ నిర్వహించాలని, ఎటువంటి ఫిర్యాదును నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. జూలై 31 నుండి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణ జరుగుతుందని, సెప్టెంబర్ 28 వరకు వాటి పరిష్కార ప్రక్రియ కొనసాగు తుందని తెలిపారు. తుది ఓటరు జాబితాను అక్టోబర్ 1న ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు. అంతకుముందు శుక్రవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఎస్ఐఆర్-2026 ప్రక్రియ నిర్వహణ, శిక్షణ, ఇతర అంశాలపై జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులకు ఉన్నత స్థాయి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించి, దిశానిర్దేశం చేశారు. జిల్లా ఎన్నికల అధికారులు, ఎన్నికల నమోదు అధికారులు, సహాయక ఎన్నికల నమోదు అధికారులు, బిఎల్ఓలు, సూపర్‌వైజర్లతో సహా ఎన్నికల అధికారులకు శిక్షణా కార్యక్రమం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఖమ్మం కలెక్టరే ట్ నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్డీసీ రాజేశ్వరీ, ఎలక్షన్ సూపరింటెండెంట్ రాజు, తహసీల్దార్ జయచందర్, అన్సరీ, అధికారులు, తదితరులున్నారు.

## ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోండి

**ఉపాధి కల్పన శాఖ అధికారి ఎన్.మాధవి**



**ఖమ్మం, మే 29 (పీపుల్స్ డైరీ) :** నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈనెల 30వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి ఎన్.మాధవి తెలిపారు. అగ్రోటెక్ ఇరిటిలైజర్స్ కంపెనీలో ఖమ్మం జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలలో 110 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహించనుండగా, 21-35 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉన్న 10వ తరగతి నుండి డిగ్రీ వరకు అర్హత ఉన్న వారు అర్హులని వెల్లడించారు. ఆసక్తి, అర్హతలు కలిగి ఉన్నవారు ఖమ్మం టీటీడీసీ భవనంలో 30వ తేదీన ఉదయం 10గంటలకు జరగబోయే ఇంటర్వ్యూలకు సర్టిఫికెట్ల జిరాక్స్ తో హాజరుకావాలని సూచించారు.

## తెలంగాణ ఐకెపి, వివోఏలు జేఏసీ, సర్ఫ్ నిరవధిక సమ్మె

**సంఘీభావం తెలిపిన బీఆర్ఎస్ పార్టీ మాజీ ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు దిండిగల రాజేందర్**



**ఇల్లందు (భద్రాద్రి కొత్తగూడెం) మే 29 (పీపుల్స్ డైరీ) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలంలో పనిచేస్తున్న ఐకేపీ సెర్ఫ్ అనుబంధ వివోఏలు ఉద్యోగులు, తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం గత 12 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తూ , నిరాహార దీక్షా కొనసాగిస్తున్న క్రమంలో , బిఆర్ఎస్ పార్టీ నాయకులు నిరాహార దీక్షా శిభిరంను సందర్శించి , 12 రోజులుగా సమ్మె చేస్తున్న వివోఏ లకు మద్దతు తెలియచేసి సంఘీభావం ప్రకటించారు. వారి న్యాయమైన డిమాండ్స్ ను పరిష్కరించాలని ప్రభుత్వంను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బి ఆర్ ఎస్ పార్టీ వ్యవస్థపాక సభ్యులు, ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షులు దిండిగాల రాజేందర్ వారిని ఉద్దేశించి మాట్లాడుతూ , కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాక ముందు తమ ఎన్నికల ప్రణాళికలో పొందు పరిచిన మేరకు వివోఏ ఆయల వేతనాలు పెంచాలని, జీవో నెంబర్ 58ని సవరించాలని, అర్హులైన వివోఏలను కమ్యూనిటీ కోఆర్డినేటర్లుగా నియమించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు రాష్ట్రంలోని వివిధ పట్టణాలలో వివిధ వర్గాల ప్రజలకు ఆచరణ సాధ్యం కానీ హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చి 2 1/2 సంవత్సరాలు గడిచినా, ఇచ్చిన హామీలను అమలు చేయలేక అన్ని వర్గాల ప్రజలను వంచన చేసి నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహారిస్తున్నదని , మీ సమస్యల పరిష్కారం కోసం తుద వరకు పోరాటం చేయాలని , బిఆర్ఎస్ పార్టీ మీ సమస్యల పరిష్కారం కోసం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇవ్వడం జరిగినది . బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధి బృందనికి వివోఏ ల జేఏసీ నాయకురాలు . నవ్య స్వాగతం పలికి తమ సమ్మె కు గలకారణాలను వివరించడం జరిగినది ఈ కార్యక్రమంలో టౌన్ మాజీ వైస్ ప్రెసిడెంట్ అబ్దుల్ నబీ, నారపాక వసంతరావు, పరికపల్లి రవి గౌడ్, రాచపల్లి శీను, సన రాజేష్,మూల గుండ్ల ఉపేందర్ రావ్, లలిత్ కుమార్ పాసి, వంగ సునీల్ కుమార్, శ్రీకాంత్, మునగంటి శివ,సన రాజేష్, గడ్డి శ్రీనివాస్, ఎండి అమీర్, సర్దార్, తదితరులు పాల్గొన్నారు



## మహిళా సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

**ఇల్లందు (భద్రాద్రి కొత్తగూడెం) మే 29 (పీపుల్స్ డైరీ) :** ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య ఆదేశాలతో 16 వార్డు కౌన్సిలర్ ఉల్లింగ విజయలక్ష్మి ఆధ్వర్యంలో చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డా కిరణ్ మిత్ర హాజరై మహిళలకు స్వయంగా చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే మహిళలకు నిజమైన అభివృద్ధి జరుగుతోంది. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి అర్హురాలు వినియోగించుకోవాలి. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం వడ్డీ లేని రుణాలు అందిస్తున్నాం. మహాలక్ష్మి పథకం, ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి, 500కే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలతో మహిళలకు అండగా నిలుస్తున్నాం అని తెలిపారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డా కిరణ్ మిత్ర పుట్టినరోజును పురస్కరించుకొని మహిళలు చైర్‌పర్సన్ తో పాటు కౌన్సిలర్ ఉల్లింగ విజయలక్ష్మి కి శాలువాతో సన్మానించారు. అనంతరం చైర్‌పర్సన్ తో కేక్ కట్ చేయించి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మహిళలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కౌన్సిలర్ ఉల్లింగ విజయలక్ష్మి మాట్లాడుతూ ఎమ్మెల్యే కోరం కనకయ్య సహకారంతో, చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర సూచనలతో వార్డులోని ప్రతి మహిళకు ప్రభుత్వ పథకాలు చేరవేస్తాం అని అన్నారు.



## మండుటెండలో గ్రామ దీపికలు..

**ఖమ్మం, మే 29 (పీపుల్స్ డైరీ) :** కొణిజర్ల మండలంలోని గ్రామ దీపికలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కొణిజర్లలో వివోఏలు నిరవధిక దీక్షలను మండుటెండను సైతం లెక్కచేయకుండా గ్రామీణ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న గ్రామ దీపికలు తమ ఉద్యోగ భద్రత, కనీస వేతనం, హెచ్ఆర్ పాలసీల కోసం మండుటెండలో ఎనిమిది రోజులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్న తమ బతుకుల్లో వెలుగులు నింపాలని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఈ పోరాటంలో చెపువి పోరాటానికి ప్రతిపక్షాలు ప్రజా సంఘాలు మద్దతు ప్రకటించారు. ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లను పరిష్కరించకపోతే, స్పందించకపోతే ఈ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు

## కుట్రలో భాగమే కాచినపల్లి బూటకపు ఎన్‌కౌంటర్

**సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ (ప్రజా పంథా )రాష్ట్ర నాయకులు నాయిని రాజు**



**ఇల్లందు (భద్రాద్రి కొత్తగూడెం) మే 29 (పీపుల్స్ డైరీ) :** పోలారం గ్రామంలో కాంచనపల్లి బూటకపు ఎన్కౌంటర్ లో హత్యగావించబడి 35 సంవత్సరాలు నిండిన సందర్భంగా పోలారం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి అఖిలభారత ఐక్య రైతు సంఘం ఇల్లందు మండల అధ్యక్షులు జూకంటి గాంధీ అధ్యక్షత వహించగా అరుణోదయ రాష్ట్ర అధ్యక్షులు అజ్మీర బిచ్చ అమరవీరులపై పాటతో నివాళులర్పించారు తదుపరి సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు నాయిని రాజు, డివిజన్ నాయకులు శ్రీరామ్ కోటయ్యలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కొమరారం ప్రాంతీయ కమిటీ సహాయ కార్యదర్శి మోడంరాంబాబు. మండల నాయకులువజ్జ వీరభద్రం. భూక్య పాషా. కుంజ సమ్మయ్య. ఎం సంపత్. ఎం లక్ష్మీనారాయణ. గాదే సత్యనారాయణ. బండి నారాయణ. పులుసు కిరణ్. పి వై ఎల్ మండల నాయకులు వల్లోజు చంద్రశేఖర్. తేలే లక్ష్మయ్య. జు .కృష్ణ. రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



**ఏన్కూర్, మే 29 (పీపుల్స్ డైరీ) :** ఏన్కూరు మండలంలో గురువారం రాత్రి ఈదురు గాలులు

## ఈదురు గాలుల బీభత్సం

**ధ్వంసంమైన ఇళ్ళు, తెగిన విద్యుత్ తీగలు**

**ఏన్కూర్, మే 29 (పీపుల్స్ డైరీ) :** ఏన్కూరు మండలంలో గురువారం రాత్రి ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. విద్యుత్ స్తంభాలు, చెట్లు పడిపోయాయి. చాలాచోట్ల విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. మెరుపులు, పిడుగుల శబ్దాలు, ఈదురు గాలులతో వర్షం కురిసింది. టి యల్ పేట లో చల్ల రమేష్, చల్ల బాలకృష్ణ లకు చెందిన రేకుల ఇళ్ళు ధ్వంసమయ్యాయి. ఫ్రిడ్జ్, టీవీ, సామాగ్రి ధ్వంసమయ్యాయి. దీంతో ఆ కుటుంబాల వారు భయాందోళనలకు గురయ్యారు. రాత్రంతా బిక్కుబిక్కుమంటూ గడిపారు. పేద కుటుంబాలకు చెందిన వీరికి ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేయాలని కోరుతున్నారు. టిఎల్‌పేట, తిమ్మారావుపేటలో స్తంభాలు పడిపోయాయి, రాయ మాదారం, రాజలింగాల, మూల పోచారం, శ్రీరామ్ గిరి, కేసు పల్లి, తిమ్మారావుపేట, జన్నారం, రేపల్లెవాడ, రామ తండా తదితర ప్రాంతాల్లో ఈదురు గాలుల మూలంగా విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. దీంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సంబంధిత అధికారులు, సిబ్బంది విద్యుత్ సరఫరా పునరుద్ధీకరణకు చర్యలు తీసుకున్నారు.

## ఎమ్మెల్యేపై చేస్తున్న తప్పుడు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నా

**కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఎట్టి హరికృష్ణ**



**ఇల్లందు (భద్రాద్రి కొత్తగూడెం) మే 29 (పీపుల్స్ డైరీ) :** పూసపల్లి ఓసి నిర్మాణం కోసం ఎమ్మెల్యే నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజల అభివృద్ధి, ప్రాంత ప్రగతి కోసం ఎమ్మెల్యే తీసుకుంటున్న చర్యలను చూసి ఓర్వలేక కొందరు బీఆర్ఎస్ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే హరిప్రియ తండ్రి సీతారాములు పూసపల్లి ప్రాంతంలో మాజీ సర్పంచ్ సహకారంతో ఒక బిసి రైతు భూమిని అధికార బలంతో తీసుకుంది వాస్తవం కాదా అధికారం కోల్పోయిన తర్వాత పూసపెల్లి గ్రామ రైతులు ఆ భూమిని ఆ రైతుకి అప్పగించింది వాస్తవం కాదా. నిన్న ప్రెస్ మీట్ పెట్టిన పేడ్ ఆర్టిస్టులు బిర్యానీ కోటర్ తీసుకొని పెట్టే వీళ్లు ఎమ్మెల్యేనీ విమర్శించే స్థాయి వీలది కాదు అందులో ఒక వ్యక్తి ఇల్లందు మున్సిపల్ కమిషనర్ మీద దాడి చేసిన కేసులో జైలుకుపోయిన వ్యక్తి ఎమ్మెల్యేని విమర్శించడం సిగ్గుచేటు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఒళ్ళు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు. ప్రజలను తప్పుదారి పట్టించే విధంగా ఎమ్మెల్యే ప్రతిష్టను దెబ్బతీయాలని ప్రయత్నిస్తే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదన్నారు. ఇంకొకసారి ఎమ్మెల్యే పై తప్పుడు ఆరోపణలు చేస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరిస్తూ, వ్యక్తిగత విమర్శలు మానుకోవాలని సూచించారు.

## నకిలీ విత్తనాల అమ్మకాలపై కఠిన చర్యలు



**ఏన్కూరు, మే 29 (పీపుల్స్ డైరీ) :** ఏన్కూరు మండలం టి.ఎల్.పేట గ్రామంలో మండల వ్యవసాయ అధికారి ఎ. నరసింహారావు, సర్పంచ్ ప్రవీణ్, కార్యదర్శి గోపి ఆధ్వర్యంలో రైతులకు గ్లైసిల్/నకిలీ బీటీ పత్తి విత్తనాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులు అనధికారికంగా విక్రయించే గ్లైసిల్ బీటీ పత్తి విత్తనాలను వినియోగించవద్దని సూచించారు. ఇటువంటి విత్తనాల వాడకం వల్ల పంట దిగుబడుల తో పాటు రైతుల ఆరోగ్యానికి కూడా ముప్పు ఏర్పడే అవకాశముందని తెలిపారు. గ్రామాల్లో నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టడంలో సర్పంచులు, పంచాయతీ అధికారులు, గ్రామ నిఘా సమితి సభ్యులు మరియు వ్యవసాయ విస్తరణ అధికారులు కీలక బాధ్యత వహించాలని మండల వ్యవసాయ అధికారి ఎ.నరసింహారావు పేర్కొన్నారు. గ్రామాల్లోకి వచ్చి నకిలీ విత్తనాలకు అడ్వాన్స్ బుకింగ్లు చేసే లేదా అక్రమంగా అమ్మకాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటువంటి సమాచారం తెలిసిన వెంటనే వ్యవసాయ శాఖ లేదా పోలీసు అధికారులకు తెలియజేయాలని రైతులను కోరారు. పంట కోతల అనంతరం పంట అవశేషాలను భూమిలో కలియదున్నాలని సూచించారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల భూమి సారవంతత తగ్గడంతో పాటు పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు. పంట అవశేషాల దహనం చేసిన వారిపై సంబంధిత చట్టాల ప్రకారం జరిమానాలు మరియు జైలు శిక్షలు విధించే అవకాశం ఉందన్నారు. అలాగే రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ త్వరగా పూర్తి చేసుకోవాలని, మొబైల్ ఫోన్ నంబర్ అప్డేషన్‌ను సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారుల ద్వారా చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కె. కమలాకర్, గ్రామ నిఘా సమితి సభ్యులు మరియు రైతులు పాల్గొన్నారు.

## ఏన్కూరులో వివోఏల వంటావార్పుతో నిరసన



**ఏన్కూరు, మే 29 (పీపుల్స్ డైరీ) :** తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏన్కూరులో వివో ఏ ల నిరవధిక దీక్షలు శుక్రవారం 8వ రోజుకు చేరుకున్నాయి. దీనిలో భాగంగా వీరంతా వంట వార్పు నిర్వహించి తమ నిరసన వ్యక్తం చేశారు. దీక్షాశిభిరం దగ్గర వంటలు చేసి అక్కడే భోజనాలు చేశారు. కార్యక్రమంలో శాంతారావు, చిరంజీవి, చంద్రావతి, బేబీ, కవిత, హైమావతి, నరసింహారావు, కోటేశ్వరరావు, సులోచన, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు. వి.వో ఎ.ల నిరవధిక దీక్షలో తెలంగాణ ఉద్యమకారులు పాల్గొని సంఘి భావం తెలిపారు. గిద్దగిరి సత్యనారాయణ, కొంటూ సాంబయ్య, ఇంజం దేవదాసు, ధర్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే, కుటుంబ సభ్యులపై ఆరోపణలు అసత్యం

**బీ ఆ ం ఎ స్ నాయకులపై చర్యలు తీ న ు కో వా ల ని డీఎస్పీకి ఫిర్యాదు**




**ఇల్లందు (భద్రాద్రి కొత్తగూడెం) మే 29 (పీపుల్స్ డైరీ) :** ఎస్టీ ఆదివాసి వర్గానికి చెందిన ఇల్లందు శాసన సభ్యులు కోరం కనకయ్య, వారి కుటుంబ సభ్యులపై బీఆర్ఎస్ పార్టీకి చెందిన కొందరు నాయకులు ఇటీవల చేస్తున్న అసత్య, నిరాధార, రాజకీయ దుష్ప్రచారాలను ఇల్లందు కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నామని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ బోళ్ల సూర్యం, 20వ వార్డు కౌన్సిలర్ మహమ్మద్ జాఫర్ పేర్కొన్నా రు. ఈ సందర్భంగా ఇల్లందు పోలీసు డీఎస్పీ వెంకన్న బాబుని కలిసి, ఎస్టీ ఆదివాసి వర్గానికి చెందిన ప్రజా ప్రతినిధి అయిన ఎమ్మెల్యే కోరం కనకయ్య గౌరవాన్ని దెబ్బతీసేలా, వారి కుటుంబ సభ్యులపై కావాలనే తప్పుడు ఆరోపణలు చేస్తూ సామాజికంగా, రాజకీ యంగా అవమానించే ప్రయత్నం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు సిలువేలు సత్యనారాయణ, పరుచూరి వెంకటేశ్వర్లు, ఎస్కె చాంద్ పాషా, గిన్నారపు రాజేష్, సత్తాల హరీష్, పాటు మరికొందరిపై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద క్రిమినల్ చట్టాలతో కూడా, వెంటనే కేసు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని అధికారికంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఒక గిరిజన ప్రజా ప్రతినిధి ఎదుగుదలను జీర్ణించుకోలేక బీఆర్ఎస్ నాయకులు కుట్రపూరితంగా వ్యక్తిగత దూషణలకు దిగడం అత్యంత బాధాకరం, ఖండనీయమన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, గిరిజనుల ఆత్మగౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలు, ఆరోపణలు ఏ రూపంలో వచ్చినా కాంగ్రెస్ పార్టీ సహించబోదని హెచ్చరించారు. రాజకీయంగా ఎదుర్కోలేక వ్యక్తిగత విమర్శలు, తప్పుడు ప్రచారాలు చేయడం బీఆర్ఎస్ నాయకుల దివాళాకోరు రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు. ఇలాంటి చర్యలు వెంటనే ఆపకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో

## పార్టీకి చెడ్డపేరు తెచ్చేవారిని ఉపేక్షించేది లేదు

### మండల అధ్యక్షుడు రామనాథం



**పినపాక, మే 29 (పీపుల్స్ డైరీ) :** కాంగ్రెస్ పార్టీ పేరు చెప్పుకొని వ్యక్తిగత ప్రయోజనాల కోసం వ్యవహరిస్తూ పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రామనాథం, కాంగ్రెస్ ఆర్గనైజింగ్ జిల్లా సెక్రెటరీ బోడ రమేష్ స్పష్టం చేశారు. ఇటీవల కొన్ని పత్రికలు, సోషల్ మీడియా వేదికల్లో కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన అంశాలపై ప్రచారంలోకి వచ్చిన వార్తలపై పార్టీ అధిష్టానం సీరియస్‌గా దృష్టి సారించిందని తెలిపారు. ఆ విషయాలపై సమగ్ర విచారణ అనంతరం త్వరలోనే నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. పార్టీ పేరు చెప్పుకొని ఎవరైనా ప్రజలను, అధికారులను లేదా కార్యకర్తలను బెదిరించే ప్రయత్నాలు చేస్తే అలాంటి చర్యలను కాంగ్రెస్ పార్టీ సహించదని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీకి ఒక వ్యవస్థ, క్రమశిక్షణ మరియు నియమ నిబంధనలు ఉన్నాయని, వాటికి విరుద్ధంగా వ్యవహరించే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కొంతమంది వ్యక్తులు తమను తాము మండల అధ్యక్షులుగా ప్రచారం చేసుకోవడం, పత్రికల్లో వార్తలు రాయించుకోవడం జరుగుతోందని, ఇది పార్టీ విధానాలకు వ్యతిరేకమని రామనాథం అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అధికారికంగా ప్రకటించిన 17 నామినేషన్లలో ఎంపికైన వారే మండల అధ్యక్షులుగా గుర్తింపు పొందారని స్పష్టం చేశారు. అధిష్టానం నిర్ణయించిన నాయకత్వాన్ని ప్రతి కార్యకర్త గౌరవించాలని సూచించారు. గతంలో పార్టీ కార్యాలయానికి తాళం వేసిన వారే పార్టీకి మొత్తం మేమే అని చెప్పుకునే పరిస్థితి ఉంటుందన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ వారికి గుర్తింపు ఉంటుందన్నారు.పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే కాంగ్రెస్ నాయకుల ప్రధాన లక్ష్యమని తెలిపారు. వ్యక్తిగత ప్రచారం కోసం పార్టీ పేరును దుర్వినియోగం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు పార్టీ సిద్ధంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు అందరూ క్రమశిక్షణతో పనిచేసి పార్టీ అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల ఉపాధ్యక్షులు కొంబత్తిని శ్రీను వాసరావు, భూపాలపట్నం సర్పంచ్ స్వప్న, ఉప్పాక సర్పంచ్ బాబురావు, ఉప్పాక ఉపసర్పంచ్ కోడెం రామ్ మోహన్ రావు, సంపత్, మార్తా మనోజ్,నక్కల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **KONDAPARTHI KIRAN,** PRINTED AT SATYANARAYANA PRINTERS, H.NO.4-6-144, TILAK ROAD, KARIMNAGAR-505001, KARIMNAGAR DISTRICT, TELANGANA, STATE. PUBLISHED AT H.NO. 10-3-488, OPP: RTC WORK SHOP, KARIMNAGAR-505001, KARIMNAGAR DISTRICT, TELANGANA STATE,
**EDITOR : KONDAPARTHI KIRAN.RNI NO: TEL/TEL/2009/28544, CELL:9493019044,** e-mail : peoplesdairydaily@gmail.com